# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి ॥ సంపుటి : 1 ॥ సంచిక : 11 ॥ మంగళవారం ॥ 25.08.2026 ॥ పేజీలు : 8 ॥ వెల రూ. 2

Medchal Malkajgiri ॥ Volume: 1 ॥ Issue: 11 ॥ Tuesday ॥ 25.08.2026 ॥ Pages: 8 ॥ Rate: 2


## రైతు ఉద్యమ పెద్దదిక్కు ఇకలేరు



- ప్రముఖ రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత
- 88 ఏళ్ల వయసులో అనారోగ్యంతో తుదిశ్వాస
- రైతు సమస్యలపై దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం
- అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా కీలక సేవలు
- కమ్యూనిస్టు, రైతు సంఘాల్లో విషాదఛాయలు

2

### రైతాంగ పోరాట యోధుడికి
## నేతల నివాళి

- సారంపల్లి మల్లారెడ్డి మృతిపై సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి
- కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు: కూనంనేని
- ఆయన పోరాటం తరాలకు స్ఫూర్తిదాయకం: హరీశ్‌రావు

2

# తెలంగాణపై కేంద్రం వివక్ష!



## అందుకే అమెరికా పర్యటన అడ్డగింత

"నా అమెరికా పర్యటనను అడ్డుకోవడం నన్ను వ్యక్తిగతంగా అవమానించడం కాదు.. తెలంగాణ ప్రజలను అవమానించడమే. నా పర్యటనను ఆపగలరు.. కానీ తెలంగాణ అభివృద్ధిని, మా లక్ష్యాలను అడ్డుకోలేరు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పెట్టుబడుల సాధన కోసం చేపట్టాలనుకున్న అధికారిక అమెరికా పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వికసిత్ భారత్-2047లో భాగంగానే తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాన్ని ప్రకటించిందన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్రాన్ని ఆర్థిక పురోభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే విదేశీ పర్యటనలకు వెళ్తున్నామని వివరించారు.

- హైదరాబాద్ ఆగస్టు 24

2లో

- ఇంగ్లాండ్‌కు అనుమతించి.. అమెరికాకు నిరాకరణ?
- గుజరాత్ సీఎంకు అనుమతి.. తెలంగాణ సీఎంకు అడ్డంకులా?
- ఇది నాకు జరిగిన అవమానం కాదు..
- నాలుగు కోట్ల ప్రజలకు జరిగిన అన్యాయం
- తెలంగాణ అభివృద్ధిని మాత్రం ఎవరూ అడ్డుకోలేరు
- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం




# 19 ఏళ్లకే అందాల కిరీటం

## 'మిస్ యూనివర్స్ ఇండియా-2026'గా కాజియా లిజ్ మెజో

- 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి కేరళ యువతి ఘనత
- లా చదువుతూనే మోడలింగ్‌లో సత్తా.. కళల్లోనూ బహుముఖ ప్రజ్ఞ
- నవంబర్‌లో ప్రపంచ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం

కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో అందాల ప్రపంచంలో మరో అరుదైన ఘనత సాధించారు. జైపూర్‌లో అట్టహాసంగా జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా-2026' గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచారు.



4

## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

ఒక్కచుక్క చమురు సరఫరా కానివ్వం
ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు



### సింఘేశ్వర ఆలయం వద్ద
## తోపులాట

- ఆరుగురు భక్తులకు గాయాలు
- శ్రావణ సోమవారం కావడంతో ఆలయానికి పోటెత్తిన జనం
- అకస్మాత్తుగా కూలిన బారికేడ్.. భయాందోళనలో భక్తులు

4

## కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాతో బతికేస్తున్న కేటీఆర్
- టీపీసీసీ చీఫ్ మహేశ్

3

కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.



## నకిలీ డీఎస్పీగా అవతారం

### రూ.1.20 కోట్ల మోసం

వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు



3



## కల్యాణలక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

- దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

3




## 22ఏపై అపోహలొద్దు

- లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చామనడం పచ్చి అబద్ధం
- వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి
- నిజమైన సమస్యలకు 24 నుంచి 36 గంటల్లో పరిష్కారం
- పట్టణ భూ గరిష్ఠ పరిమితి భూములపై త్వరలో విధాన నిర్ణయం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి

2



4

## ఇంజనీరింగ్ విద్యార్థికి 'ఉగ్ర' లింకులు?

రామగుండంలో ఎన్ఐఏ తనిఖీల కలకలం

ముజామిల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ముమ్మరంగా ప్రశ్నలు




# 19 ఏళ్లకే అందాల కిరీటం

**'మిస్ యూనివర్స్ ఇండియా-2026'గా కాజియా లిజ్ మెజో**

**52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి కేరళ యువతి ఘనత**

**లా చదువుతూనే మోడలింగ్‌లో సత్తా.. కళల్లోనూ బహుముఖ ప్రజ్ఞ**

**నవంబర్‌లో ప్రపంచ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం**

**జైపూర్, ఆగస్టు 24 :** కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో అందాల ప్రపంచంలో మరో అరుదైన ఘనత సాధించారు. జైపూర్‌లో అట్టహాసంగా జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా-2026' గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచారు. ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని సొంతం చేసుకున్న కాజియా.. నవంబర్‌లో పోర్టోరికో వేదికగా జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. కేరళకు చెందిన కాజియా బాల్యం ఎక్కువగా యూఏఈలోని అబుదాబిలో గడిచింది. అక్కడి ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం న్యాయ విద్య అభ్యసిస్తూనే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. అందాల పోటీలకే పరిమితం కాకుండా కళారంగంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

**నాట్యం నుంచి నటన వరకు..**

కాజియా 12 ఏళ్ల పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. గానం, సంగీతంపైనా ఆమెకు మంచి పట్టు ఉంది. డ్రమ్స్, వయోలిన్ వాయించగలరు. బహిరంగ ప్రసంగాలు, నటనలోనూ అనుభవం సంపాదించారు. మలయాళ చిత్రం 'షైలాక్' ద్వారా నటిగా వెండితెరకు పరిచయమయ్యారు. చిన్న వయసులోనే అందాల పోటీల్లో విజయాల పరంపర మొదలుపెట్టారు. 17 ఏళ్ల వయసులో 'మిస్ టీన్ దివా-2024' కిరీటాన్ని గెలుచుకున్నారు. 2025 మిస్ టీన్ ఇంటర్నేషనల్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి తొలి రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది 'మిస్ యూనివర్స్ కేరళ--2026' విజేతగా నిలవడంతో పాటు ఆ కిరీటాన్ని గెలుచుకున్న అత్యంత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందారు. తాజాగా జాతీయ కిరీటాన్ని కూడా తన ఖాతాలో వేసుకున్నారు.

**52 మందిలో మేటిగా..**

జైపూర్‌లో జరిగిన తుది పోరులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 52 మంది ఫైనలిస్టులు పోటీపడ్డారు. చివరకు కాజియా లిజ్ మెజో విజేతగా నిలవగా, తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ తొలి రన్నరప్‌గా, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవ్లేకర్ రెండో రన్నరప్‌గా నిలిచారు. అనుశ్రీ 'మిస్ ఇంటర్నేషనల్ ఇండియా--2026' టైటిల్‌ను కూడా దక్కించుకున్నారు. ఈ గ్రాండ్ ఫినాలేలో మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్‌తో పాటు ఊర్వశి రౌతేలా, సెలీనా జైట్లీ తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఇప్పుడు కాజియా లక్ష్యం ప్రపంచ కిరీటం. నవంబర్‌లో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున ఆమె ప్రదర్శనపై అందరి దృష్టి నిలవనుంది.

# తెలంగాణపై కేంద్రం వివక్ష!

**అందుకే అమెరికా పర్యటన అడ్డగింత**

**ఇంగ్లాండ్‌కు అనుమతించి.. అమెరికాకు నిరాకరణ?**

**గుజరాత్ సీఎంకు అనుమతి.. తెలంగాణకు అడ్డంకులా?**

**ఇది నాకు జరిగిన అవమానం కాదు..**

**నాలుగు కోట్ల ప్రజలకు జరిగిన అన్యాయం**

**తెలంగాణ అభివృద్ధిని మాత్రం ఎవరూ అడ్డుకోలేరు**

**కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం**



**హైదరాబాద్, ఆగస్టు 24** పెట్టుబడుల సాధనే లక్ష్యంగా చేపట్టాలనుకున్న తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం తెలంగాణపై రాజకీయ వివక్షేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతించిన కేంద్రం.. అమెరికా పర్యటనకు మాత్రం రాజకీయ కారణాలు చూపుతూ అనుమతి నిరాకరించిందని ఆరోపించారు. ఆ రాజకీయ కారణాలేమిటో ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ముందుగానే అందించినట్లు చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడులు, విద్య, క్రీడల రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంపొందించడమే పర్యటన ప్రధాన ఉద్దేశమన్నారు. అయినప్పటికీ అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం వెనుక రాజకీయ కారణాలున్నాయని ఆరోపించారు.

**గుజరాత్‌కు ఓ న్యాయం.. తెలంగాణకు మరో న్యాయమా?**

ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడాలో పర్యటించేందుకు గుజరాత్ ముఖ్యమంత్రికి కేంద్రం అనుమతి ఇచ్చిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. అదే సమయంలో 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాల్లో భాగంగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు తాను చేపట్టాలనుకున్న అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడం వివక్ష కాక మరేమిటని ప్రశ్నించారు. ఇది వ్యక్తిగతంగా తనకు జరిగిన అవమానంగా చూడటం లేదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయంగా భావిస్తున్నానని సీఎం అన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక పర్యటనకు రాజకీయ కారణాలతో అడ్డంకులు సృష్టించడం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ఇటువంటి వైఖరి సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. "నా పర్యటనను అడ్డుకోవచ్చు.. కానీ తెలంగాణ అభివృద్ధి లక్ష్యాన్ని చేరుకోకుండా ఎవరూ అడ్డుకోలేరు" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రం అనుమతి నిరాకరించిన అంశాన్ని తెలంగాణ ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావిస్తారని తెలిపారు.

**డిసెంబర్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సు**

డిసెంబర్ 8, 9 తేదీల్లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఆధ్వర్యంలో 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' నిర్వహించనున్నట్లు సీఎం వెల్లడించారు. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించడమే లక్ష్యంగా సదస్సును నిర్వహిస్తామన్నారు. విద్య, క్రీడలు సహా వివిధ రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంచడంతో పాటు భారీ పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను ప్రపంచస్థాయి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# 22ఏపై అపోహలొద్దు

- **లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చామనడం పచ్చి అబద్ధం**
- **దరఖాస్తుల్లో 98శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి**
- **నిజమైన సమస్యలకు 24 నుంచి 36 గంటల్లో పరిష్కారం**
- **నకిలీ జీవోలు, బోగస్ మెమోలతో భూదందాలు చేస్తే క్రిమినల్ కేసులు**
- **ప్రభుత్వ భూమిని ప్రైవేటుగా మార్చే ప్రయత్నాలను సహించం: మంత్రి పొంగులేటి**
- **పట్టణ భూ గరిష్ఠ పరిమితి భూములపై త్వరలో విధాన నిర్ణయం**
- **ప్రధాన ప్రతిపక్షం కోరితే 811 ఎకరాల వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు**




**హైదరాబాద్, ఆగస్టు 24 :** రాష్ట్రంలో 22ఏ పేరుతో లక్షలాది ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 22ఏపై ప్రతిపక్షాలు అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తున్నామని, ఇప్పటికే అనుమతి పొందిన కేసుల్లో దాదాపు 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. 2023 డిసెంబర్ 7 నాటికి నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ప్రస్తుతం ఎంత ఉంది? అటవీ, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రభుత్వ, కోర్టు ఆదేశాలకు సంబంధించిన భూములు ఏ మేరకు ఉన్నాయి? అనే వివరాలను కేటగిరీల వారీగా ప్రభుత్వం ప్రజల ముందు ఉంచుతోందన్నారు. "లక్షల ఎకరాలు 22ఏలో పెట్టారని ఆరోపించడం సులభం. ఎంత భూమి ఉంది? ఎందుకు నిషేధిత జాబితాలో పెట్టారు? అది ఎవరి భూమి? ఏ కారణంతో చేర్చారు? అన్న ప్రతి అంశానికీ రికార్డులతో సమాధానం చెబుతాం. వాస్తవాలు ప్రజల ముందుకు వస్తే ఎవరు నిజం చెబుతున్నారో వారే నిర్ణయిస్తారు" అని పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులు ప్రైవేట్ వ్యక్తులు, స్థిరాస్తి వ్యాపారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడటమే 22ఏ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో 122 ఎకరాలు, మరో ప్రాంతంలో 400 ఎకరాలకు పైగా కలిపి సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారాలను మంత్రి ఉదాహరణగా ప్రస్తావించారు. ఎన్నికలకు ముందే ఈ వ్యవహారాలు చర్చకు వచ్చాయని చెప్పారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలు జరిగితే వాటిని నిషేధిత జాబితాలో పెట్టడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ జీవోలు, బోగస్ మెమోలు, అధికారుల సంతకాలతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టిస్తున్న వ్యవహారాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని మంత్రి వెల్లడించారు. మేడ్చల్ జిల్లాలో ఏప్రిల్ 22 తేదీతో కలెక్టర్ సంతకం చేసినట్లు నకిలీ మెమో, మరోచోట జూన్ 2 తేదీతో ప్రత్యేక ఉప కలెక్టర్ పేరుతో బోగస్ ధ్రువపత్రం సృష్టించినట్లు గుర్తించామన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టానికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం త్వరలోనే విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని పొంగులేటి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్, మేడ్చల్-మల్కాజిగిరి ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటికే క్లియరెన్స్ పొందిన భూములకు సంబంధించిన ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సీఎస్--7, సీఎస్--14కు సంబంధించిన 811 ఎకరాల భూ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం కోరితే ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశిస్తామని మంత్రి ప్రకటించారు. 2017లో అప్పటి ప్రభుత్వానికి సంబంధించిన ఒక పత్రిక ఎండీ, భూస్వామి నుంచి ఖరీదైన కారు తీసుకుని ఐదు పత్రాల ద్వారా 811 ఎకరాల రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. 22ఏ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని మంత్రి తెలిపారు. పునరావృతమైన ఫిర్యాదులను తొలగిస్తే 980 ప్రత్యేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వాటిలో 547 వ్యవసాయ భూములకు, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవని వివరించారు. రంగారెడ్డి నుంచి అత్యధికంగా 258, మేడ్చల్ నుంచి 149, సంగారెడ్డి నుంచి 82 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే అనుమతి పొందిన 22ఏ కేసుల్లో సుమారు 98 శాతం రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని పొంగులేటి వెల్లడించారు. 300కు పైగా స్లాట్లలో దేవాదాయ, భూదాన్ తదితర కారణాలతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని 12 నుంచి 13 కేసులను మాత్రమే తిరస్కరించామన్నారు. రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించి కూడా రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయిన వారికి ఈ వారాంతంలోగా డబ్బును తిరిగి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 22ఏకు సంబంధించి వాస్తవమైన సమస్యలను 24 గంటల్లో, ప్రత్యేక పరిస్థితుల్లో గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. "ప్రజలను భయపెట్టడం మా ప్రభుత్వ విధానం కాదు. వారికి భరోసా ఇవ్వడం మా బాధ్యత. ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో.. చట్టబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమం జరిగితే చర్యలు తీసుకుంటాం. కానీ అబద్ధాలతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తే చూస్తూ ఊరుకోం" అని పొంగులేటి స్పష్టం చేశారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్‌కుమార్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతు ఉద్యమ పెద్దదిక్కు ఇకలేరు

- **ప్రముఖ రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత**
- **88 ఏళ్ల వయసులో అనారోగ్యంతో తుదిశ్వాస**
- **రైతు సమస్యలపై దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం**
- **అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా కీలక సేవలు**
- **కమ్యూనిస్టు, రైతు సంఘాల్లో విషాదఛాయలు**



**హైదరాబాద్, ఆగస్టు 24 :** రైతాంగ సమస్యలపై దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం సాగించిన కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు, ప్రముఖ రైతు సంఘం నేత సారంపల్లి మల్లారెడ్డి (88) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో కమ్యూనిస్టు, రైతు సంఘాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన సారంపల్లి మల్లారెడ్డి తన జీవితంలో అత్యధిక భాగాన్ని రైతాంగ ఉద్యమాలకే అంకితం చేశారు. వ్యవసాయ రంగ సమస్యలు, రైతుల హక్కులు, భూములకు సంబంధించిన వివాదాలు, రైతు కూలీల సంక్షేమం వంటి అంశాలపై నిరంతరం పోరాటాలు సాగించారు. రైతుల పక్షాన ప్రభుత్వాలను నిలదీయడంలో ముందుండేవారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మించడంలో మల్లారెడ్డి కీలక పాత్ర పోషించారు. రైతాంగానికి సంబంధించిన విధానపరమైన అంశాలపైనా ఆయనకు విశేష అవగాహన ఉండేది. రైతుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటిపై విస్తృత చర్చ జరిగేలా కృషి చేశారు. అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించి కొత్తతరం కార్యకర్తలకు మార్గదర్శకుడిగా నిలిచారు. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన మల్లారెడ్డి.. రైతు సంఘాన్ని బలోపేతం చేయడంలో తనదైన ముద్ర వేశారు. కమ్యూనిస్టు ఉద్యమంతో మమేకమై రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం చివరి వరకు తన గళాన్ని వినిపించారు.

**ఉద్యమ ప్రస్థానానికి ముగింపు**

మల్లారెడ్డి మృతిపై కమ్యూనిస్టు పార్టీలు, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైతాంగ ఉద్యమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, రైతుల పక్షాన నిలిచిన నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని సంతాపం తెలిపారు. మల్లారెడ్డి పార్థివదేహాన్ని హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో అభిమానులు, రైతు సంఘాల నేతలు, కార్యకర్తలు, ప్రజల సందర్శనార్థం మధ్యాహ్నం వరకు ఉంచనున్నట్లు సమాచారం. అనంతరం అంత్యక్రియలకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు వెల్లడించనున్నారు.

## సీఎం, కూనంనేని, హరీశ్‌రావు సంతాపం





సారంపల్లి మల్లారెడ్డి మృతికి సీఎం రేవంత్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. రైతుల హక్కులు, సాగునీరు, రుణాలు, విత్తనాలు మరియు భూమి సమస్యల పరిష్కారం కోసం జీవితాన్ని అంకితం చేసిన మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన కృషిని గుర్తుచేసుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. మల్లారెడ్డి మృతి కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై ఆయనకు లోతైన అవగాహన ఉండేదని, అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రజాప్రతినిధులకు ఆయన ఇచ్చిన సూచనలు ఎంతో ఉపయోగపడేవని గుర్తుచేసుకున్నారు. మల్లారెడ్డి పోరాట జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతాంగ సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, కుటుంబ సభ్యులకు మరియు అభిమానులకు నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రాజ్య సంస్కరణ మంగళవారం, 25.08.2026, మేడ్చల్ మల్కాజిగిరి

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల ఆందోళనలు
- 420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. 6 గ్యారెంటీలపై నిలదీత
- 'బాకీ కార్డుల' ప్రచారాన్ని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్తాం
- గ్రామం నుంచి నగరం వరకు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 24:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న వేళ.. ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్త పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు, ప్రజా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ వారం రోజుల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని చెప్పిందని గుర్తుచేశారు. ఇప్పుడు వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ వర్గాలకు ఎంత బాకీ పడిందో ప్రజలకు వివరించేందుకు గతంలో చేపట్టిన 'బాకీ కార్డు' ప్రచారాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమిటి? ఇప్పటివరకు అందింది ఎంత? ఇంకా రావాల్సింది ఎంత? అనే వివరాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజలతో చర్చించాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. ప్రభుత్వంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుంచాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రధాన అంశంగా తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. సుమారు రూ.12 వేల కోట్ల బకాయిల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. కళాశాలలకు వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. యువతకు ఉద్యోగాల కల్పనలోనూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, విద్యార్థుల సమస్యలను ప్రత్యేకంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, దళితులు, బీసీలు, గిరిజనులు, ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. ఆయా వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ వాటి అమలు పరిస్థితిని వివరించాలని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల నుంచి ఇప్పటివరకు చోటుచేసుకున్న పరిపాలనా వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి ఆందోళనలతోపాటు సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృత ప్రచారం నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. యువతను ఆకట్టుకునేలా వినూత్న ప్రచార కార్యక్రమాలు రూపొందించి కాంగ్రెస్ హామీలు, వాటి అమలు తీరును ప్రజల ముందుంచాలని చెప్పారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ బాధ్యులు, సీనియర్ నాయకులు వారం రోజుల కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పాల్గొనాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ యంత్రాంగమంతా కదిలి కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ప్రజాక్షేత్రంలో నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# శాసనసభ కమిటీలదే కీలక పాత్ర

- ప్రభుత్వ శాఖల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ
- సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడాలి
- క్షేత్రస్థాయి పర్యటనలతో లోటుపాట్లను గుర్తించాలి
- ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 24:** ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలదే కీలక పాత్ర అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ శాఖల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు సమర్థవంతంగా చేరేలా చూడాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలును పరిశీలించి లోటుపాట్లను గుర్తించడంతోపాటు వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో సోమవారం లెజిస్లేచర్ మైనారిటీల సంక్షేమ కమిటీ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది. నూతన కమిటీ చైర్మన్లు, సభ్యులకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాసనసభ కమిటీలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ శాఖల పనితీరుపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు లక్ష్యాలకు అనుగుణంగా అమలవుతున్నాయా? కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చవుతున్నాయా? పథకాల ప్రయోజనాలు అర్హులకు అందుతున్నాయా? అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధికారుల నుంచి సమాచారం తెప్పించుకోవడంతోపాటు కమిటీ సభ్యులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని చెప్పారు. షెడ్యూల్డ్ కులాలకు అమలవుతున్న సంక్షేమ పథకాల్లో లోటుపాట్లను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి స్పష్టమైన సూచనలు చేయాలని పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఏ మేరకు ఖర్చయ్యాయనే అంశంపైనా సమగ్ర వివరాలు సేకరించాలని సూచించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ తాను 2008లో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర జనాభాలో సుమారు 18 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కోసం కమిటీ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలన్నారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో సమన్వయం చేసుకుంటూ మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మైనారిటీల సంక్షేమ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతారావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్, ఎస్సీ సంక్షేమ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం, సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, మండలి కార్యదర్శి వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

## ప్రభుత్వానికి మానవహక్కుల కమిషన్ ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 24:** తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతులకు హాజరవుతున్నారంటూ ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు అందాయి. ఆయా నివేదికలను పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, ఊట్కూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాత రేకుల పైకప్పు తరగతి గదుల్లో లీకేజీలు ఏర్పడటంతో, మరమ్మతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులను తాత్కాలికంగా చెట్ల కింద కూర్చోబెట్టి తరగతులు నిర్వహించినట్లు నివేదికలో వెల్లడించారు. విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పారిశుధ్య సౌకర్యాలు, ఇతర ప్రాథమిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. విద్యా హక్కు కేవలం పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పరిమితం కాదని, పిల్లలు సురక్షితమైన, గౌరవప్రదమైన, అనుకూలమైన వాతావరణంలో విద్యను అభ్యసించే పరిస్థితులు కూడా అందులో భాగమేనని కమిషన్ పేర్కొంది. మిషన్ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక సౌకర్యాలపై నివేదికలు కోరాలని సిఫారసు చేసింది. అలాగే ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తక్షణ మరియు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. చర్యల వివరాలను ఆరు నెలల్లోగా కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.




# కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

## కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

## సోషల్ మీడియాతో బతికేస్తున్న కేటీఆర్

## మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో టీపీసీసీ చీఫ్



**మెదక్, ఆగస్ట్ 24 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఎఐసీసీకి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# కల్యాణలక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

## దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 24:** తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# నకిలీ డీఎస్పీగా అవతారం

## రూ.1.20 కోట్ల మోసం..

## వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు

**హైదరాబాద్, ఆగస్ట్ 24 :** నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2021 నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న కేవీపీ రాజును ఎట్టకేలకు సీసీఎస్ ఈఓడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు. కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజుపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ డీఎస్పీగా తనను తాను పరిచయం చేసుకుంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నారా, అతడి మోసాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అరెస్ట్ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## సంపాదకీయం



# ధరల మంట పాలకులకు పట్టదా?

**నిత్యావసరాల నుంచి నిర్మాణ సామగ్రి వరకు భగ్గుమంటున్న ధరలు**

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల రోజువారీ సమస్యలు పట్టడం లేదన్న భావన బలపడుతోంది. ఎన్నికలు వస్తే కొత్త పథకాలు, ఉచిత హామీలు, ఓటర్లను ఆకట్టుకునే ప్రకటనలు తెరపైకి వస్తున్నాయి. కానీ పేద, మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరుస్తున్న ధరల పెరుగుదలపై మాత్రం అదే స్థాయిలో చర్చ కనిపించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే అయినా, రాష్ట్రాల్లోని ప్రభుత్వాలైనా ధరల నియంత్రణకు నిరంతర పర్యవేక్షణ, సమగ్ర కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. నిత్యావసరాల నుంచి ఇంటి నిర్మాణ సామగ్రి వరకు ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. బియ్యం, చక్కెర, బెల్లం, ఉల్లి, వెల్లుల్లి, ఎండుమిర్చి, వంటనూనెలు, పూలు, పండ్లు.. ఇలా ఏ వస్తువు ముట్టుకున్నా ధర షాక్ తగులుతోంది. సంపాదన అదే స్థాయిలో ఉండగా ఇంటి నెలవారీ బడ్జెట్ మాత్రం పెరుగుతుండటంతో మధ్యతరగతి కుటుంబాలు ఖర్చుల్లో కోత పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సన్నరకం బియ్యం ధర కిలో రూ.80 వరకు చేరడం సామాన్య కుటుంబాలను కలవరపెడుతోంది. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థపై ఒత్తిడి వంటి కారణాలను మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ వద్ద అవసరాలకు మించి సేకరించిన ధాన్యం భారీగా ఉన్నప్పటికీ దాన్ని సమర్థంగా మార్కెట్లోకి తీసుకొచ్చి ధరలను నియంత్రించగలిగామా అన్న ప్రశ్న తలెత్తుతోంది. చింతపండు ధర రూ.200 దాటుతోంది. చక్కెర ధర కూడా అనూహ్యంగా పెరిగింది. ఉల్లిగడ్డ ధర నెల వ్యవధిలోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22 నుంచి రూ.26 మధ్య ఉన్న ధర ఇప్పుడు రూ.45 నుంచి రూ.52 వరకు పలుకుతోంది. వెల్లుల్లి ధర రూ.120--130 నుంచి రూ.250 వరకు చేరింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కు ఎగబాకింది. లీటరు వంటనూనె ప్యాకెట్ రూ.175 వరకు చేరుతోంది. బెల్లం కిలో రూ.55 నుంచి రూ.70--75 వరకు పెరిగింది. ఇలాంటి సమయంలో చక్కెర ధర పెరిగినా మధుమేహం కారణంగా ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండదన్న తరహాలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు వ్యాఖ్యానించడం సమస్య తీవ్రతను తక్కువ చేసి చూపడమే అవుతుంది. ధర పెరుగుదల ఒక్క వస్తువుతో ఆగిపోదు. టీ దుకాణం నుంచి మిఠాయి తయారీ వరకు దాని ప్రభావం ఇతర వస్తువుల ధరలపైనా పడుతుంది. బోనాలు, శ్రావణమాస పూజలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సమయంలో పూలకు డిమాండ్ పెరగడం సహజమే. కానీ ఆ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొన్ని ప్రాంతాల్లో ధరలను అమాంతం పెంచుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పూజకు పూలు, వంటకు సరుకులు, పెళ్లికి బంగారం.. ఏది కొనాలన్నా కుటుంబ బడ్జెట్‌ను ఒకటికి రెండుసార్లు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంగారం ధరలు పెళ్లిళ్లు చేసే కుటుంబాలకు మరింత భారంగా మారాయి. కనీస ఆభరణాలు, మంగళసూత్రం చేయించాలన్నా భారీ మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. దీనికితోడు తయారీ చార్జీలు, తరుగు, పన్నులు కలిసేసరికి వినియోగదారుడిపై భారం మరింత పెరుగుతోంది. బంగారం కొనుగోలులో ధరలు, స్వచ్ఛత, తయారీ చార్జీల విషయంలో వినియోగదారులకు మరింత పారదర్శకత అవసరం. ఇల్లు కట్టుకోవాలనుకునే మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. సిమెంట్, ఉక్కు, ఇటుక, ఇసుక నుంచి కార్మికుల కూలీల వరకు నిర్మాణ వ్యయం పెరుగుతోంది. అప్పు చేసి చిన్న ఇల్లు కట్టుకోవాలనుకున్న కుటుంబాలు అంచనా వ్యయం పెరగడంతో పనులను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు మరో పెద్ద సమస్య. విద్య, వైద్యం, ఇంటి అద్దె, ప్రయాణం వంటి తప్పనిసరి ఖర్చులకు తోడు నిత్యావసరాల ధరలు పెరిగితే సామాన్యుడి సంపాదనలో పొదుపునకు చోటెక్కడ? ఉత్పత్తి తగ్గింది.. సరఫరా దెబ్బతింది.. వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు.. పండగల డిమాండ్ పెరిగింది.. అంటూ ధరల పెరుగుదలకు రోజుకో కారణం వినిపిస్తోంది. కానీ ప్రభుత్వాలు చేయాల్సింది కారణాలు చెప్పడం కాదు.. కారణాలను ముందుగానే గుర్తించి ధరల మంట సామాన్యుడికి తగలకుండా చూడటం. దేశంలో ఏ పంట ఎంత పండుతోంది? ఎంత వినియోగం ఉంది? ఎంత నిల్వ ఉంది? ఏ రాష్ట్రంలో కొరత ఏర్పడుతోంది? ఎక్కడ మిగులు ఉంది? సరఫరాలో ఎక్కడ ఆటంకం ఏర్పడుతోంది? అక్రమ నిల్వలు జరుగుతున్నాయా? కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అన్న అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైనప్పుడు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయాలి. అక్రమ నిల్వదారులు, బ్లాక్ మార్కెటీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా, పండగలు, సెలవులు, రద్దీ సమయాల్లో టికెట్ ధరలు సామాన్యుడికి అందనంతగా పెరుగుతున్న సందర్భాలు ఉన్నాయి. విమానయాన రంగంలో పోటీ, సేవలు, ఛార్జీల తీరుపైనా ప్రభుత్వ పర్యవేక్షణ అవసరం. ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావడం అంటే విమానాశ్రయాలు నిర్మించడం ఒక్కటే కాదు.. ఆ సేవలను భరించగలిగే స్థాయిలో ఉంచడం కూడా ముఖ్యమే. రాజకీయ పార్టీలు ఒకరి ఉచిత హామీలను మరొకరు విమర్శించుకోవడంలో చూపుతున్న ఆసక్తి ధరల పెరుగుదలపై కనిపించడం లేదు. అధికారంలో ఉన్నవారు తమ పథకాల గొప్పతనాన్ని ప్రచారం చేసుకుంటుంటే, ప్రతిపక్షాలు కూడా ప్రజల రోజువారీ జీవన వ్యయంపై నిర్మాణాత్మక చర్చకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. పార్లమెంటు, శాసనసభలు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితం కాకూడదు. బియ్యం ఎందుకు పెరిగింది? చక్కెర ఎందుకు ఎగబాకింది? ఉల్లి ధర ఎందుకు రెట్టింపైంది? వంటనూనెల ధరలను ఎలా తగ్గించాలి? అక్రమ నిల్వలను ఎలా అడ్డుకోవాలి? మధ్యతరగతి కుటుంబాల జీవన వ్యయాన్ని ఎలా తగ్గించాలి? అన్న అంశాలపై చర్చ జరగాలి. ఎన్నికల సమయంలో ఓటరే రాజు అని చెప్పే నేతలను.. ఎన్నికల మధ్యకాలంలోనూ ప్రజలే ప్రశ్నించాలి. ఉచితంగా ఏం ఇస్తారన్నదే కాదు.. సంపాదించిన రూపాయికి ఎంత విలువ మిగిలేలా పాలిస్తున్నారు? అని నిలదీయాలి. ఎందుకంటే సామాన్యుడికి కావాల్సింది ప్రకటనల ఉపశమనం కాదు.. మార్కెట్‌కు వెళ్లినప్పుడు కనిపించే నిజమైన ధరల ఉపశమనం.

రాజ్య సంస్కరణ

# ఆయుధాల వేటలో పాక్.. కొత్త కూటమిపై కన్ను!

- ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక సామర్థ్యాల పెంపుపై దృష్టి
- టర్కీ సైనిక విమానాల రాకపోకలతో కొత్త అనుమానాలు
- డ్రోన్లు, సైనిక సామగ్రి తరలిస్తున్నట్లు నివేదికలు
- మక్కా రక్షణ ఒప్పందంలోకి ఇరాన్‌ను ఆహ్వానించినట్లు కథనాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ తన సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు వస్తున్న వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. ఓవైపు టర్కీ, చైనా నుంచి ఆయుధాలు, డ్రోన్లు, ఇతర సైనిక సామగ్రిని సమకూర్చుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు ఇస్లామిక్ దేశాలతో సమష్టి రక్షణ కూటమిని విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఆయుధాల సరఫరా, ప్రతిపాదిత రక్షణ కూటమికి సంబంధించిన పలు అంశాలపై సంబంధిత దేశాల నుంచి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. పాకిస్థాన్‌లోని కీలక వైమానిక స్థావరాలకు ఇటీవల టర్కీ సైనిక రవాణా విమానాల రాకపోకలు పెరిగినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. రావల్పిండిలోని నూర్‌ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు ఆగస్టు 19 నుంచి 21 మధ్య టర్కీకి చెందిన సైనిక రవాణా విమానాలు వచ్చి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. వీటి ద్వారా డ్రోన్లు, వాటికి సంబంధించిన పరికరాలు లేదా ఇతర సైనిక సామగ్రిని తరలించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై పాకిస్థాన్, టర్కీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. టర్కీ తయారీ మానవరహిత యుద్ధ వ్యవస్థలపై పాకిస్థాన్ కొంతకాలంగా ఆసక్తి చూపుతోంది. ఇప్పటికే బైరక్తార్ టీబీ-2 తరహా డ్రోన్లు పాక్ వద్ద ఉన్నట్లు సమాచారం. భవిష్యత్ యుద్ధ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లక్ష్యంపై వేచి ఉండి దాడి చేసే మానవరహిత ఆయుధ వ్యవస్థలను మరింతగా సమకూర్చుకునే ప్రయత్నాల్లో పాక్ ఉన్నట్లు రక్షణ వర్గాల్లో చర్చ సాగుతోంది. చైనా నుంచి కూడా వాయురక్షణ వ్యవస్థలు సహా సైనిక సామగ్రిని సమకూర్చుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ మధ్య సమష్టి రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. దీనిని 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం'గా పేర్కొంటూ, మరికొన్ని ఇస్లామిక్ దేశాలను కూడా ఇందులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ కూటమిలో చేరాలని ఇరాన్‌కు సైతం ఆహ్వానం అందినట్లు పశ్చిమాసియా మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఇరాన్ విదేశాంగ శాఖ నుంచి దీనిపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య గతంలో నెలకొన్న ఉద్రిక్తతలు, హూతీల విషయంలో ఉన్న విభేదాల నేపథ్యంలో ఇరాన్ చేరిక ఎంతవరకు సాధ్యమవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన పాకిస్థాన్, నాటో సభ్యదేశమైన టర్కీ, పశ్చిమాసియాలో కీలక శక్తిగా ఉన్న సౌదీ అరేబియా ఒకే రక్షణ వ్యవస్థ కిందకు వస్తే ప్రాంతీయ వ్యూహాత్మక సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముంది. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న 'మక్కా ఒప్పందం', అందులోని నిబంధనలు, ఇరాన్‌కు ఆహ్వానం వంటి అంశాలకు అధికారిక నిర్ధారణ లభించిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# గో స్మగ్లర్లపై పోలీసుల తూటా!

**మీరట్‌లో పోలీసులకు, స్మగ్లర్లకు మధ్య కాల్పులు**

**ఎదురుకాల్పుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు**





**ఉత్తర్‌ప్రదేశ్, ఆగస్టు 24:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో గోవుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడుతున్నారన్న సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులకు, అనుమానిత స్మగ్లర్లకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో తస్లీమ్, భూరా అనే ఇద్దరు నిందితులు తీవ్రంగా గాయపడ్డారు. మీరట్‌లోని ఓ ప్రాంతంలో కొందరు గోవులను అక్రమంగా తరలించడంతో పాటు గోవధకు పాల్పడుతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సంఘటన స్థలంలో ఓ గోవు చెట్టుకు కట్టేసి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులను గమనించిన తస్లీమ్, భూరా కాల్పులకు దిగారని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరూ గాయపడగా వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మరో నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. తస్లీమ్‌పై ఇప్పటికే 15 కేసులు, భూరాపై 10 కేసులు ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థికి 'ఉగ్ర' లింకులు?

**రామగుండంలో ఎన్ఐఏ తనిఖీల కలకలం**

**ముజామిల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు**

**ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ముమ్మరంగా ప్రశ్నలు**



**పెద్దపల్లి, ఆగస్ట్ 24:** పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయన్న అనుమానాలు కలకలం రేపాయి. అయోధ్యనగర్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా రామగుండానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఉగ్రవాద సంస్థలతో ముజామిల్‌కు సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం అతడిని ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ముజామిల్ కార్యకలాపాలు, ఇటీవల అతడు ఎవరెవరితో సంప్రదింపులు జరిపాడు, అతడి పరిచయాలు ఏమిటి, అనుమానిత సంస్థలు లేదా వ్యక్తులతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణాల్లో అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అతడి డిజిటల్ కార్యకలాపాలు, ఇతర సంబంధాలపైనా దర్యాప్తు సాగుతున్నట్లు సమాచారం. అయితే ముజామిల్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న విషయం అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ప్రస్తుతం అతడిని అనుమానాల నేపథ్యంలో ప్రశ్నిస్తున్నట్లు మాత్రమే సమాచారం ఉండటంతో దర్యాప్తు పూర్తయ్యే వరకు దీనిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

# సింఘేశ్వర ఆలయం వద్ద తోపులాట

**ఆరుగురు భక్తులకు గాయాలు**

**శ్రావణ సోమవారం కావడంతో ఆలయానికి పోటెత్తిన జనం**

**అకస్మాత్తుగా కూలిన బారికేడ్.. భయాందోళనలో భక్తులు**

**గత వారమే లఖిసరాయ్ ఘటనలో ఏడుగురు మృతి**



**బిహార్, ఆగస్టు 24:** బిహార్: మధేపురాలోని సింఘేశ్వర ఆలయం వద్ద సోమవారం ఉదయం తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. శ్రావణ సోమవారం కావడంతో సింఘేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అయితే, భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు ఏర్పాటు చేసిన ఓ బారికేడ్ అకస్మాత్తుగా కూలిపోయింది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే తొక్కిసలాట వంటి పరిస్థితి నెలకొంది. ఒకరినొకరు తోసుకోవడంతో సుమారు ఆరుగురు భక్తులు గాయపడ్డారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం మధేపురాలోని జననాయక్ కర్పూరి ఠాకూర్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అయితే, ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ, మేజిస్ట్రేట్ అభిషేక్ రంజన్ సహా ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరోవైపు, అదనపు బలగాలను కూడా మోహరించారు. పరిస్థితిని వెంటనే అదుపులోకి తీసుకువచ్చారు. అధికారులు నిర్దేశించిన మార్గదర్శకాలను భక్తులు పాటించాలని, ప్రశాంతంగా ఉండాలని ఆలయ ట్రస్ట్ కమిటీ కోరింది. కాగా, గత సోమవారం లఖిసరాయ్ జిల్లాలోని అశోక్ ధామ్ ఆలయం వద్ద తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. భారీ జనసందోహానికి తోడు విద్యుత్ స్తంభం కూలిపోయిందనే వదంతి కారణంగా తొక్కిసలాట జరిగినట్లు అధికారులు తెలిపారు.

# అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

**ఒక్కచుక్క చమురును కూడా సరఫారా కానివ్వం**

**ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 24 :** అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.



రాజ్య సంస్కరణ మంగళవారం, 25.08.2026, మేడ్చల్ మల్కాజిగిరి

## జూనియర్ డాక్టర్ల సమ్మెపై..

# ఘాటు విమర్శలు

- స్టైపెండ్ పెంపుపై ప్రభుత్వాన్ని నిలదీసిన జగన్



జూనియర్ డాక్టర్ల ఆందోళనపై వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబు ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. రాష్ట్రంలోని 19 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చెందిన దాదాపు 9 వేల మంది ఇంటర్న్‌లు, పీజీలు, సూపర్ స్పెషాలిటీ, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు రెండు వారాలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం జనవరి 1 నుంచి అమల్లోకి రావాల్సిన స్టైపెండ్ సవరణను ఎందుకు నిలిపివేశారని నిలదీశారు. తమ ప్రభుత్వ హయాంలో జూనియర్ డాక్టర్ల స్టైపెండ్‌ను జీవో నంబర్ 287లోని 15 శాతం కంటే అధికంగా 42.4 శాతం పెంచామని, సూపర్ స్పెషాలిటీ కోర్సు అభ్యసిస్తున్న వారిని సీనియర్ రెసిడెంట్లుగా గుర్తించి వారి స్టైపెండ్‌ను కలిపి మొత్తంగా 77 శాతం వరకు పెంచామని జగన్ తెలిపారు. ఆయుష్ జూనియర్ డాక్టర్లకు కూడా అల్లోపతి వైద్యుల తరహాలోనే పెంపు ఇచ్చామని పేర్కొన్నారు. ధరలు, ద్రవ్యోల్బణం, జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో 15 శాతానికి మించి పెంపు కోరుతున్న డాక్టర్లకు కేవలం 3 నుంచి 5 శాతం పెంపు ప్రతిపాదించడం అన్యాయమని విమర్శించారు.

### అత్యవసర వైద్య సేవలకు అంతరాయం

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్య సేవలు జూనియర్ డాక్టర్ల శ్రమపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయని జగన్ పేర్కొన్నారు. వారి సమ్మె కారణంగా క్యాజువాలిటీ, ఐసీయూ, లేబర్ రూమ్ వంటి అత్యవసర విభాగాల్లో సేవలకు అంతరాయం ఏర్పడి పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దీనికి ప్రభుత్వ మొండివైఖరే కారణమని విమర్శించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.3 వేల కోట్లకుపైగా బకాయిలు పెట్టిందని, దీంతో కొన్ని ఆస్పత్రులు సేవల విషయంలో వెనక్కి తగ్గుతున్నాయని ఆరోపించారు. తమ హయాంలో ఒకేసారి 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకొచ్చామని, ఐదు పూర్తి చేసి తరగతులు ప్రారంభించామని, మరో కాలేజీని తరగతులకు సిద్ధం చేసి మొత్తం ఆరు అందుబాటులోకి తెచ్చామని జగన్ వివరించారు. మిగిలిన కాలేజీలను పూర్తి చేయాల్సిన ప్రభుత్వం వాటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడునేడు పనులు నిలిపివేశారని, WHO/GMP ప్రమాణాలకు అనుగుణమైన మందుల కొరత ఉందని, జీరో వేకెన్సీ విధానాన్ని పక్కన పెట్టారని అన్నారు.

### చర్చలకు పిలిచి సమస్య పరిష్కరించండి

వైద్యరంగంలో తమ ప్రభుత్వం నియమించిన 50 వేల మంది సిబ్బందిని క్రమంగా తగ్గిస్తున్నారని జగన్ ఆరోపించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని దెబ్బతీశారని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో స్పెషలిస్ట్ వైద్యులను తొలగించారని, విలేజ్ క్లినిక్‌లు, అర్బన్ క్లినిక్‌లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ వ్యవస్థను కూడా బలహీనపరిచారని ఆరోపించారు. ప్రజారోగ్య వ్యవస్థను ప్రభుత్వం దెబ్బతీస్తోందని పేర్కొంటూ, చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికైనా అహంకారం వీడి జూనియర్ డాక్టర్ల ప్రతినిధులను వెంటనే చర్చలకు పిలవాలని జగన్ డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి తగిన స్థాయిలో స్టైపెండ్ పెంచాలని, సమ్మెను విరమింపజేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఆయన స్వయంగా చేసిన ఆరోపణలుగా ఉండగా, ప్రభుత్వం వైపు నుంచి ఈ అంశాలపై స్పందన రావాల్సి ఉంది.

# కాకినాడ కుటుంబ మరణాలపై కీలక మలుపు

- లవ్ జిహాద్ కోణంపై ఇంకా ఆధారాలు లేవన్న ఎస్పీ

కాకినాడలో నూకరాజు కుటుంబం మరణాల కేసులో 'లవ్ జిహాద్'కు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు దర్యాప్తులో బయటపడలేదని కాకినాడ ఎస్పీ బిందు మాధవ్ స్పష్టం చేశారు. ఆగస్టు 16న రాజమహేంద్రవరం రోడ్ కమ్ రైలు బ్రిడ్జిపై నుంచి నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, పదేళ్ల మనవడు గోదావరిలోకి దూకిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో బాలుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. సౌజన్య రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్ ఆధారంగా షేక్ సాధిక్ ఖాన్‌పై మత మార్పిడికి ఒత్తిడి, హత్య, బెదిరింపులు, వసూళ్లకు సంబంధించిన అభియోగాలతో కేసు నమోదైంది. అయితే మరింత లోతైన దర్యాప్తులో 'లవ్ జిహాద్'కు సంబంధం ఉన్నట్లు తేలితే అదనపు సెక్షన్లు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు.

### సౌజన్య భర్త హత్యపైనా దర్యాప్తు

సౌజన్య, సాధిక్ ఖాన్ దాదాపు రెండేళ్లుగా సన్నిహితంగా ఉన్నారని, ఈ విషయం ఆమె కుటుంబ సభ్యులకు కూడా తెలుసునని పోలీసులు తెలిపారు. అదే సమయంలో సౌజన్య భర్త జగదీశ్వరరెడ్డి హత్య కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. సౌజన్య సూసైడ్ నోట్‌లో సాధిక్ తనను మరో మతంలోకి మారాలని ఒత్తిడి చేశాడని, తన మాట వినకపోతే కుమారుడిని తీవ్రవాద సంస్థకు అప్పగిస్తానని బెదిరించాడని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో తన భర్తకు కెనడా నుంచి తెప్పించిన రసాయనంతో విషప్రయోగం చేసి హత్య చేశాడని కూడా ఆమె పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఆరోపణలన్నీ ప్రస్తుతం పోలీసుల దర్యాప్తులోనే ఉన్నాయి. సాధిక్ ఖాన్‌ను ఆగస్టు 22న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో పోలీసులు అరెస్టు చేశారు. అతడిని కేరళకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



### సెప్టెంబర్ 3 వరకు జ్యుడీషియల్ కస్టడీ

మీరట్ కోర్టు ట్రాన్సిట్ వారెంట్ మంజూరు చేయడంతో సాధిక్ ఖాన్‌ను కాకినాడకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా సెప్టెంబర్ 3 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. అతడిని కాకినాడ సబ్‌జైలుకు తరలించారు. ఈ కేసులో సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ప్రతి ఆరోపణను విడివిడిగా పరిశీలిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా సౌజన్య భర్త హత్య, మత మార్పిడికి సంబంధించిన ఆరోపణలు, కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం 'లవ్ జిహాద్' ఆరోపణకు నిర్ధారిత ఆధారం లేదని పోలీసులు స్పష్టం చేయడంతో, తదుపరి దర్యాప్తు ఫలితాలే కేసు దిశను నిర్ణయించనున్నాయి.

## కాకినాడ కేసుపై కేంద్ర దర్యాప్తునకు

# బీజేపీ డిమాండ్

- లవ్ జిహాద్‌పై సోము వీర్రాజు సంచలన వ్యాఖ్యలు



కాకినాడ కుటుంబ మరణాల ఘటనలో 'లవ్ జిహాద్' కోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు డిమాండ్ చేశారు. ఈ కేసులో అసలు కుట్రను వెలికి తీయాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ పోలీసులపై ఉందని ఆయన అన్నారు. ఆగస్టు 16న అసిస్టెంట్ ఇంజనీర్ నూకరాజు, ఆయన భార్య, కుమార్తె సౌజన్య, పదేళ్ల మనవడు రాజమహేంద్రవరం వద్ద గోదావరిలోకి దూకిన ఘటనలో ముగ్గురు మృతి చెందగా బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. సౌజన్య, నూకరాజు రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్లలో మత మార్పిడికి సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని వీర్రాజు పేర్కొన్నారు.

### మత మార్పిడి వెనుక గ్యాంగ్ ఉందా?

ఈ కేసులో నిందితుడిగా ఉన్న 26 ఏళ్ల షేక్ సాధిక్ ఖాన్ నూకరాజు కుటుంబాన్ని మరో మతంలోకి మారాలని ఒత్తిడి చేశాడని సోము వీర్రాజు ఆరోపించారు. సౌజన్య భర్తను విషప్రయోగంతో హత్య చేశాడన్న ఆరోపణపైనా లోతైన విచారణ జరగాలని కోరారు. మత మార్పిడి అనేది ఒక్క వ్యక్తి ఆలోచన కాదని, దీని వెనుక ఒక గ్యాంగ్ ఉండే అవకాశం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కొందరు వ్యక్తులు సాధిక్ ఖాన్‌కు ఆశ్రయం కల్పించారని కూడా ఆరోపించారు. ఆగస్టు 22న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో సాధిక్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు సముద్రమార్గం ద్వారా దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వీర్రాజు తెలిపారు. కుట్ర వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

### హోంమంత్రి, డీజీపీపై వీర్రాజు విమర్శలు

కాకినాడ కేసులో ఆగస్టు 24 వరకు హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పందించకపోవడం విచారకరమని సోము వీర్రాజు విమర్శించారు. గోదావరి ప్రాంతంలో 'లవ్ జిహాద్' ఆరోపణలతో కేసు నమోదైన నేపథ్యంలో ప్రభుత్వం దీనిని తీవ్రంగా పరిగణించాలని కోరారు. కేసు దర్యాప్తును రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర నిఘా సంస్థల పరిధిలోనూ పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై బీజేపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నరేంద్ర నేతృత్వంలో పార్టీ నాయకులు సమగ్ర దర్యాప్తు కోరుతూ అధికారులకు లిఖితపూర్వక విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. అయితే 'లవ్ జిహాద్' కోణం ఇప్పటివరకు నిర్ధారణ కాలేదని పోలీసులు చెబుతున్న నేపథ్యంలో, ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## కాకినాడ ఘటనపై

# రాజకీయ మౌనం ఎందుకు?

- ఐదు పేజీల నోట్‌తో విజయసాయి ఆరోపణలు



కాకినాడ కుటుంబ ఆత్మహత్య ఘటనలో 'లవ్ జిహాద్' ఆరోపణలపై అధికార పక్షం, విపక్షం మౌనం పాటిస్తున్నాయని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయంతోనే రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని పక్కన పెడుతున్నాయని ఆయన విమర్శించారు. అసిస్టెంట్ ఇంజనీర్ నూకరాజు కుటుంబం ఆగస్టు 16న రాజమహేంద్రవరం వద్ద గోదావరిలోకి దూకిన ఘటనలో నూకరాజు, ఆయన భార్య, కుమార్తె సౌజన్య మృతి చెందగా పదేళ్ల బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి సౌజన్య రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో కీలక ఆరోపణలు ఉన్నాయని విజయసాయిరెడ్డి తెలిపారు. ఐదు పేజీల సూసైడ్ నోట్ పూర్తి వివరాలను సోమవారం ఎక్స్‌లో పోస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు.

### మత మార్పిడికి ఒత్తిడి అంటూ ఆరోపణలు

సౌజన్యను సాధిక్ ఖాన్ ఇస్లాం మతంలోకి మారాలని ఒత్తిడి చేశాడని, ఇస్లామిక్ సాహిత్యాన్ని చదవడం, రాయడం నేర్చుకోవాలని బలవంతం చేశాడని విజయసాయిరెడ్డి ఆరోపించారు. మాట వినకపోతే ఆమె కుమారుడిని ఉగ్రవాదుల చేతికి అప్పగిస్తానని బెదిరించినట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారని తెలిపారు. సాధిక్ ఖాన్ వెనుక ఒక గ్యాంగ్ ఉందని, ఈ వ్యవహారం వ్యక్తిగత సంబంధానికి మాత్రమే పరిమితం కాదని విజయసాయిరెడ్డి అన్నారు. సౌజన్య భర్త జగదీశ్వర రెడ్డికి హైదరాబాద్‌లో కెనడా నుంచి తెప్పించిన రసాయనంతో నెమ్మదిగా పనిచేసే విషం ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. నూకరాజును బెదిరించి బంగారం, నగదు తీసుకోవడంతో పాటు రూ.12 కోట్ల విలువైన భూములను రిజిస్టర్ చేయించినట్లు కూడా ఆరోపించారు.

### ప్రభుత్వాలపై ప్రశ్నలు.. బాలుడికి రక్షణ కోరుతూ

కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లో గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయని ప్రస్తావించిన విజయసాయిరెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అధికార పార్టీ, విపక్షం ఈ వ్యవహారాన్ని బయటకు రానివ్వడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్, బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. 2019 నుంచి అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మత మార్పిడుల అంశంపై ప్రేక్షకులుగా మిగిలిపోయాయని విమర్శించారు. అసెంబ్లీలో పూర్తి మెజారిటీ ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో మత మార్పిడుల నిరోధక చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడిన సౌజన్య పదేళ్ల కుమారుడికి సాధిక్ ఖాన్, అతడి అనుచరుల నుంచి ముప్పు ఉందన్న ఆరోపణలపై అధికారులు వెంటనే దృష్టి పెట్టాలని విజయసాయిరెడ్డి కోరారు.



# హామీల అమలులో దగా

- బీసీలకు బాబు సర్కారుకు ధోకా
- బీసీ గర్జనలో వైసీపీ నేతల ధ్వజం

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ బీసీ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలో నిర్వహించిన 'బీసీ గర్జన' సదస్సులో ప్రభుత్వ విధానాలపై మండిపడిన నేతలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. 50 ఏళ్లు దాటిన బీసీ మహిళలకు రూ.4 వేల పెన్షన్, కురువ, చేనేత, రజక, నాయిబ్రాహ్మణ తదితర కులవృత్తుల సంక్షేమ పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో జీవో నంబర్ 105 ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. చట్టబద్ధత లేకుండా రిజర్వేషన్లపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు రాజకీయ డ్రామాగా మారాయని మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేశ్, రమేష్ యాదవ్ తదితరులు ఆరోపించారు. వైఎస్ జగన్ హయాంలో బీసీలకు రూ.1.70 లక్షల కోట్లకుపైగా డీబీటీ ద్వారా నిధులు అందించామని, 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజకీయ ప్రాధాన్యం కల్పించామని వారు తెలిపారు.

### రాష్ట్రవ్యాప్త పోరాటానికి వైసీపీ కార్యాచరణ

బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వకుండా చంద్రబాబు అవమానించారని, ప్రశ్నించే బీసీ నేతలపై అక్రమ కేసులు, దాడులతో కక్ష సాధిస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపించారు. బీసీ డిక్లరేషన్ అమలు, 34 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత, రూ.4 వేల పెన్షన్ హామీ, బీసీ సంక్షేమ పథకాల పునరుద్ధరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్లకు చైర్మన్లు నియమించకుండా నిధులు నిలిపివేశారని, చేనేత, టైలర్లు, రజకులు, నాయిబ్రాహ్మణులకు గతంలో అందిన ప్రోత్సాహకాలను తగ్గించారని విమర్శించారు. శాశ్వత బీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో గ్రామం నుంచి జోనల్ స్థాయి వరకు సదస్సులు నిర్వహించి, బీసీ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి రాష్ట్రవ్యాప్త ప్రజా పోరాటం చేపడతామని వైసీపీ నేతలు ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బీసీలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం వైపు నుంచి స్పందన రావాల్సి ఉంది.

# బ్యారన్ ట్రంప్ తలపై రూ.95 కోట్ల రివార్డ్

- ఇరాన్ బెదిరింపుతో అమెరికాలో టెన్షన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు బ్యారన్ ట్రంప్‌పై ఇరాన్ నుంచి తీవ్ర బెదిరింపు వెలువడినట్లు వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రసారమైన ఓ వీడియోలో 20 ఏళ్ల బ్యారన్‌ను లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిస్తూ 10 మిలియన్ డాలర్లు, అంటే రూ.95 కోట్లకు పైగా రివార్డు ప్రకటించినట్లు కథనం పేర్కొంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్‌కు అనుబంధ మీడియా విడుదల చేసిన ఈ వీడియోలో బ్యారన్ కదలికలను చూపిస్తూ, అతడి భద్రతకు సంబంధించిన అంశాలపై సంచలన వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

### సీక్రెట్ సర్వీస్ భద్రతపై ఆరోపణలు

వీడియోలో బ్యారన్ సోషల్ మీడియా, గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించే విధానంపై వివరాలు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. గతంలో అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్న వీడియోను కూడా ఇరాన్ ప్రసారం చేసినట్లు కథనం తెలిపింది. అందులో బ్యారన్‌కు హెచ్చరికలు జారీ చేసినట్లు పేర్కొంది. మెలానియా, బ్యారన్‌కు అమెరికా సీక్రెట్ సర్వీస్ 24 గంటల భద్రత కల్పిస్తోంది.



### అమెరికా-ఇరాన్ ఉద్రిక్తత మరింత పెరుగుతుందా?

ఈ బెదిరింపు వీడియో వెలువడిన సమయంలోనే ఇరాన్‌పై అమెరికా ఆర్థిక ఒత్తిడి పెంచుతామని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ మాత్రం అమెరికా చర్యలను తమ సైనిక వైఫల్యాన్ని అంగీకరించినట్లుగా అభివర్ణించింది. దీంతో ఇరుదేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తత మరింత తీవ్రంగా మారే సంకేతాలు కనిపిస్తున్నాయి. బ్యారన్‌పై వచ్చిన బెదిరింపులపై అమెరికా భద్రతా వ్యవస్థ అప్రమత్తంగా ఉన్నట్లు కథనం పేర్కొంది.

# మద్యం స్కాంలో కారుమూరికి రిమాండ్

- సెప్టెంబర్ 7 వరకు జ్యుడీషియల్ కస్టడీ

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు రూ.195 కోట్ల ఏపీఎస్‌బీసీఎల్ మద్యం రవాణా కుంభకోణం కేసులో కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సెప్టెంబర్ 7 వరకు ఆయనను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాలని నాంపల్లి ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు సోమవారం ఆదేశించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆగస్టు 23న ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం కారుమూరిని అరెస్టు చేసింది. అనంతరం సోమవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ కేసులో కారుమూరి కీలక పాత్ర పోషించారని ఈడీ ఆరోపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ అదనపు కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదు కావడం గమనార్హం.

### టెండర్ల నుంచి నిధుల మళ్లింపు వరకు

మద్యం రవాణా కాంట్రాక్టుల కోసం రూపొందించిన టెండర్ నిబంధనలను కొన్ని సంస్థలకు అనుకూలంగా మార్చినట్లు ఈడీ ఆరోపించింది. సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతరం ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్‌కు ప్రయోజనం కలిగేలా టెండర్లను రూపొందించారని దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఈ సంస్థలు ఫ్రంట్ కంపెనీలుగా పనిచేశాయని ఆరోపించింది. మార్కెట్ ధరల కంటే అధిక రేట్లకు రవాణా కాంట్రాక్టులు కేటాయించడం ద్వారా అక్రమ ఆదాయం వచ్చినట్లు ఈడీ తెలిపింది. కారుమూరి తన కుమారుడు సునీల్ కుమార్‌తో కలిసి రాజకీయ పలుకుబడిని ఉపయోగించి రవాణా సబ్‌కాంట్రాక్టుల కేటాయింపులో ప్రభావం చూపారని ఆరోపించింది. నకిలీ లేదా పెంచిన ఇన్వాయిస్‌ల ద్వారా నిధులను మళ్లించినట్లు ఈడీ పేర్కొంది. ఆ డబ్బులో కొంత కారుమూరి, ఆయన కుటుంబ సభ్యుల ఖాతాలకు చేరిందని, ఖరీదైన వాహనాలు, లగ్జరీ వాచ్‌లు కొనుగోలు చేయడం, స్థిరాస్తుల కోసం అడ్వాన్సులు చెల్లించడం, రాజకీయ కార్యకలాపాలు, వ్యక్తిగత ఖర్చులకు వినియోగించినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది.



# జోగి రమేష్‌పై నరసయ్య ఫైర్



కడపలో మాజీ మంత్రి జోగి రమేష్‌పై రాష్ట్ర కల్లు గీత కార్మికుల మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య తీవ్ర విమర్శలు చేశారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు ఇంటిపైకి రౌడీ మూకలతో వెళ్లి దాడికి పాల్పడిన జోగి రమేష్ ఇప్పుడు నీతి, న్యాయం, ధర్మం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. "దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో చంద్రబాబు కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జోగి రమేష్ ఇప్పుడు తన కుటుంబంపై విమర్శలు వస్తే బాధపడటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ కార్డు పనిచేయకపోవడంతో కుటుంబం పేరుతో సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జోగి రమేష్‌పై ఉన్న ఆరోపణలు, కుంభకోణాలపై భవిష్యత్‌లో సమగ్ర విచారణ జరిగే అవకాశం ఉందని నరసయ్య అన్నారు. గతంలో చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




## పంటలకు విలువ..

# రైతులకు సంపద

- ఫుడ్ ప్రాసెసింగ్‌తో రైతులకు లాభం

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నూజివీడు సమీపంలోని ముసునూరులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి దేశీయ నాన్‌జీఎంఓ హైబ్రీడ్ పాప్‌కార్న్ మొక్కజొన్న విత్తనాలను విడుదల చేశారు. అనంతరం దేశంలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో నాన్‌జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న సాగు చేస్తున్నారని సీఎం తెలిపారు. దేశ పాప్‌కార్న్ ఉత్పత్తిలో గార్మె సంస్థకు 70 శాతం వాటా ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడిన పాప్‌కార్న్ సంపద ఇక దేశంలోనే ఉండేలా చూడాలని, ఆంధ్రా పాప్‌కార్న్‌ను ఆసియా మార్కెట్లతో పాటు ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అరకు కాఫీ, కోస్తా కోకో, పసుపు, మిరప, మొక్కజొన్న, ఆక్వా ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్ తో గ్లోబల్ ఉత్పత్తులుగా అభివృద్ధి చేయాలని అన్నారు.

### ప్రాసెసింగ్ పెరిగితే సంపద పెరుగుతుంది

రాష్ట్రంలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ జరుగుతోందని, ఈ స్థాయిని పెంచితే రైతులకు అధిక ఆదాయం, రాష్ట్రానికి మరింత సంపద లభిస్తుందని చంద్రబాబు తెలిపారు. యువత ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి రావాలని, ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలని ఆకాంక్షించారు. వచ్చే 20-30 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా పంటల సాగు, ఆర్థిక వ్యవస్థను ఇప్పటి నుంచే ప్రణాళిక చేసుకోవాలని అన్నారు. రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని, రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడామని తెలిపారు. చింతలపూడి, వెలిగొండ ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు గోదావరి-కృష్ణా, తుంగభద్ర-పెన్నా-కావేరీ నదుల అనుసంధానానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. నీటి భద్రతతో పాటు పంటలకు విలువ జోడిస్తే రైతులు ఆర్థికంగా బలపడతారని చంద్రబాబు స్పష్టం చేశారు.

# సర్వోత్తమ వ్యక్తి .. సమున్నత శిఖరం



## 75 ఏళ్ల వయసులో ఆరోపణలు..



### ◆దశాబ్దాల సేవకు ఇదేనా ప్రతిఫలం?
### ◆ఒక్క ఆరోపణతో ఓ జీవితాన్ని కొలవగలమా?

ఒక మనిషి జీవితాన్ని అంచనా వేయడానికి ఒక్క ఆరోపణ సరిపోతుందా? దశాబ్దాలుగా సమాజం మధ్య జీవించిన వ్యక్తి ప్రయాణం, ఆయన నిర్మించిన సంస్థలు, ఆయనతో కలిసి పనిచేసిన వందలాది కుటుంబాలు, ఆయన అందించిన సామాజిక సేవ.. ఇవన్నీ ఒక్క ఆరోపణ నీడలో కనుమరుగైపోవాలా? 75 ఏళ్ల వయసులో డీవీ మనోహర్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. ఆరోపణలు నిజమా, అవాస్తవమా అన్నది చట్టపరమైన దర్యాప్తులో తేలాల్సిన విషయం. కానీ విచారణ పూర్తికాకముందే ఒక వ్యక్తి జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, దశాబ్దాల ప్రతిష్ఠను ప్రశ్నార్థకం చేయడం మాత్రం ఆవేదన కలిగించే అంశమని బీసీ ఇంటిలెక్చ్వల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు, ఐఏఎస్, తెలంగాణ దేవాంగ సంక్షేమ సంఘం చైర్మన్ పడాల వీరభద్రరావు స్పష్టం చేస్తున్నారు. వారి అభిప్రాయం ఒక్కటే.. నిజం బయటకు రావాలి, కానీ నిజం వెలుగులోకి రాకముందే వ్యక్తిత్వ హననం జరగకూడదు.

**• పారిశ్రామిక రంగంలో తనదైన ముద్ర**

డీవీ మనోహర్ పేరు కేవలం ఒక పారిశ్రామికవేత్త పేరుగా చూడలేం. మొదటి తరం పారిశ్రామికవేత్తగా శ్రీశక్తి గ్రూప్‌ను నిర్మించి, హాస్పిటాలిటీ, విద్య, ఎల్పీజీ, సోలార్ పవర్, పబ్లిక్ బైక్ షేరింగ్ వంటి విభిన్న రంగాల్లో తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఐఐ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలందించారు. హైదరాబాద్ బైసిక్లింగ్ క్లబ్‌ను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. వరల్డ్ సైక్లింగ్ అలయన్స్‌లోనూ బాధ్యతలు చేపట్టి సైక్లింగ్ ఉద్యమాన్ని ప్రోత్సహించారు. పారిశ్రామిక రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా విశిష్ట పారిశ్రామికవేత్త పురస్కారం సహా పలు గౌరవాలు అందుకున్నారు. ఈ ప్రస్థానాన్ని విస్మరించి కేవలం ప్రస్తుత ఆరోపణల కోణంలోనే ఆయన వ్యక్తిత్వాన్ని చూడటం సమగ్ర దృష్టి కాదని ఇద్దరు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

**• నిబద్ధత.. నిజాయితీకి నిలువెత్తు రూపం**

"డీవీ మనోహర్ గారిని నేను ఎన్నో ఏళ్లుగా చూస్తున్నాను. ఆయనతో ఉన్న పరిచయం, ఆయన వ్యక్తిత్వాన్ని గమనించిన అనుభవం నాకు ఉంది. నిబద్ధత, నిజాయితీ ఆయనలో కనిపించే ప్రధాన లక్షణాలు" అని పడాల వీరభద్రరావు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా దేవాంగ సమాజంలో డీవీ మనోహర్ ఒక ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకున్నారని ఆయన చెబుతున్నారు. పరిశ్రమలను నిర్మించడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం, అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం, సమాజంతో అనుబంధంగా ఉండడం ఆయన వ్యక్తిత్వంలోని మరో కోణమని వివరిస్తున్నారు. "ఒక వ్యక్తి జీవితాన్ని ఒక్క ఆరోపణ ఆధారంగా తీర్పు చేయడం బాధాకరం. తప్పు జరిగితే చట్టం తన పని తాను చేయాలి. కానీ ఆరోపణ రుజువు కాకముందే ఒక మనిషి గౌరవాన్ని నేలమట్టం చేయడం మాత్రం సమంజసం కాదు" అన్నదే ఆయన స్పష్టమైన అభిప్రాయం.

**• వ్యక్తిత్వ హననాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం**

బీసీ ఇంటిలెక్చ్వల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు, ఐఏఎస్ కూడా ఇదే భావనను బలంగా వ్యక్తం చేస్తున్నారు. "ఒక వ్యక్తిపై ఆరోపణలు రావచ్చు. వాటిపై చట్టం విచారణ చేయాలి. కానీ ఆరోపణ వచ్చిన వెంటనే ఆ వ్యక్తి దోషి అన్నట్టుగా సామాజిక తీర్పు ఇవ్వడం సరైంది కాదు. డీవీ మనోహర్ వంటి దశాబ్దాల ప్రజా, పారిశ్రామిక ప్రస్థానం ఉన్న వ్యక్తి విషయంలో మరింత సంయమనం అవసరం" అని ఆయన అభిప్రాయపడుతున్నారు. వయసు ఒక్కటే ఆయనను నిర్దోషిగా నిర్ధారించదు.. అదే విధంగా వయసు 75 ఏళ్లు కావడం వల్ల ఆరోపణలు నిజమేనని కూడా భావించలేం. నిజం ఏదైనా సరే దర్యాప్తు ద్వారానే బయటకు రావాలి. అంతవరకు వ్యక్తిగత గౌరవాన్ని కాపాడటం, సామాజిక బాధ్యతతో వ్యవహరించడం అవసరమని ఆయన స్పష్టం చేస్తున్నారు.

**• ఆరోపణలు.. ప్రతివాదాలు.. వాస్తవం తేలాలి**

ఇటీవల హోటల్ ఉద్యోగినికి సంబంధించిన ఫిర్యాదు నేపథ్యంలో డీవీ మనోహర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో కేసు నమోదైనట్లు వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, ఆ ఆరోపణలను డీవీ మనోహర్ ఖండించారు. సంస్థలో నగదు మాయమైన అంశాన్ని ప్రశ్నించిన తరువాతే తనపై ఆరోపణలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇరు వైపుల నుంచి ఫిర్యాదులు నమోదైన నేపథ్యంలో వ్యవహారం దర్యాప్తు పరిధిలో ఉంది. ఇలాంటి సమయంలో ఆరోపణ చేసిన వ్యక్తి వాదనను కూడా నిర్లక్ష్యం చేయకూడదు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి వివరణను కూడా పక్కన పెట్టరాదు. రెండు వైపుల వాదనలను పరిశీలించి, ఆధారాలను విశ్లేషించి, చట్టం నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉంది. ఇదే ప్రజాస్వామ్య సమాజంలో న్యాయబద్ధమైన మార్గం.

**• దశాబ్దాల సేవకు ఒక్క ఆరోపణే తీర్పా?**

పడాల వీరభద్రరావు మాటల్లో ఈ వ్యవహారంపై కనిపించే ఆవేదన ఇదే. "75 ఏళ్ల వయసులో ఉన్న ఒక వ్యక్తి గురించి ఇలాంటి ఆరోపణలు వినడం బాధ కలిగిస్తోంది. ఆరోపణల నిజానిజాలు దర్యాప్తులో తేలాలి. కానీ ఒక మనిషి జీవితాంతం సంపాదించుకున్న గౌరవాన్ని విచారణ పూర్తికాకముందే మసకబార్చడం మాత్రం సరైంది కాదు" అని ఆయన అంటున్నారు. ఒక మనిషి చేసిన మంచి పనులన్నీ న్యాయస్థానంలో నిర్దోషిత్వానికి సాక్ష్యాలు కావు. అదే సమయంలో ఒక ఆరోపణ కూడా అతని మొత్తం జీవితానికి తుది తీర్పు కాదు. ఈ తేడాను సమాజం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. చట్టం ముందు అందరూ సమానమే. అదే సమయంలో ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తికి కూడా తన వాదన వినిపించే హక్కు ఉంది.

**• నిజం వెలుగులోకి రావాలి.. గౌరవం నిలవాలి**

డీవీ మనోహర్ విషయంలో ఇద్దరు మేధావుల సందేశం స్పష్టంగా ఉంది. ఆరోపణలు నిజమని తేలితే చట్టపరంగా తగిన చర్యలు తప్పక జరగాలి. అవి నిరాధారమని తేలితే ఆయనపై పడిన మచ్చను తొలగించే బాధ్యత కూడా సమాజానిదే. మధ్యలోనే తీర్పులు చెప్పడం, సామాజికంగా ఒక వ్యక్తిని దోషిగా చిత్రించడం, దశాబ్దాల సేవను ఒక ఆరోపణతో చెరిపివేయడం మాత్రం న్యాయం కాదని వారు చెబుతున్నారు. మనిషి జీవితంలో సంపాదించిన గౌరవం ఎంతో విలువైనది. దాన్ని కాపాడటం అంటే తప్పును సమర్థించడం కాదు. నిజాన్ని నిర్ధారించే వరకు న్యాయాన్ని గౌరవించడం. డీవీ మనోహర్ విషయంలోనూ ఇదే మానవీయత అవసరం. నిజం ఏదైనా బయటకు రావాలి.. న్యాయం జరగాలి.. కానీ విచారణ పూర్తికాకముందే వ్యక్తిత్వ హననం మాత్రం ఆగాలి అనేది టి. చిరంజీవులు, ఐఏఎస్, పడాల వీరభద్రరావుల స్పష్టమైన విజ్ఞప్తి.

**- టి. చిరంజీవులు, ఐఏఎస్**
**చైర్మన్, బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం, హైదరాబాద్**
**- పడాల వీరభద్రరావు, చైర్మన్**
**తెలంగాణ దేవాంగ సంక్షేమ సంఘం, హైదరాబాద్**



### 18 దేశాలు.. 18 భాషల్లో పఠనం
# విదేశీయుల నోట భగవద్గీత
## విశ్వ మహోత్సవానికి శ్రీకారం

హైదరాబాద్ గచ్చిబౌలి వేదికగా 2027 ఫిబ్రవరి 27న నిర్వహించనున్న భగవద్గీత విశ్వ మహోత్సవానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం లోగో, వెబ్‌సైట్, బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎం. రాధాకృష్ణ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫెమినా మిస్ ఇండియా 2026 విజేత ఇందు ఫాల్గుణి, నేపథ్య గాయకుడు పవన్ చరణ్, ప్రముఖ ప్రవచనకర్త అమరవాది శేషయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త సత్యప్రసాద్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు.

**18 దేశాలు.. 18 భాషల్లో పఠనం**

భగవద్గీత విశ్వ మహోత్సవంలో 18 అధ్యాయాలను 18 దేశాల్లో 18 భాషల్లో ఒకేసారి పఠించడం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అమెరికా, ఆస్ట్రేలియా, రష్యా, జర్మనీ, దక్షిణాఫ్రికా, దుబాయ్ సహా 18 దేశాలకు చెందిన విదేశీయులు ఇప్పటికే భగవద్గీత శ్లోకాలను నేర్చుకుంటున్నారు. మహోత్సవం రోజున ఆయా దేశాల ప్రతినిధులు తమ భాషల్లో శ్లోకాలను ఆలపించనున్నారు. భగవద్గీతను అంతర్జాతీయ స్థాయిలో ఇంత భారీగా ఆలపించే కార్యక్రమం ఇదే తొలిసారి అని నిర్వాహకులు కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గీతా సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

**భావితరాలకు గీతా సందేశం**

ప్రముఖ ప్రవచనకర్త అమరవాది శేషయ్య భగవద్గీత శ్లోకాల్లోని ముఖ్యమైన అంశాలను వివరించారు. భావితరాలకు భగవద్గీత విలువైన మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆధ్యాత్మికతతో పాటు జీవన విలువలు, కర్తవ్యబోధ, మానవతా సందేశాన్ని గీత అందిస్తుందని వివరించారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన వారు శ్లోకాలను నేర్చుకుని ఒకే వేదికపై ఆలపించడం భారతీయ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. గచ్చిబౌలి వేదికగా జరగనున్న ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు.



# ప్రపంచ స్పేస్ టాలెంట్‌కు మాగ్నెట్ భారత్
## స్పేస్ స్టార్టప్‌లకు అండగా ఉంటామన్న మోదీ

భారత్‌ను ప్రపంచ స్పేస్ రంగానికి ప్రధాన గమ్యస్థానంగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డే సందర్భంగా ఢిల్లీలో 20 భారతీయ స్పేస్ స్టార్టప్‌ల సీఈవోలు, వ్యవస్థాపకులతో మోదీ సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభ, కంపెనీలు, పెట్టుబడులు భారత్‌వైపు వచ్చేలా ప్రత్యేక వాతావరణం సృష్టించాలన్నారు. అంతరిక్ష రంగంలో భవిష్యత్తు నిర్మించాలనుకునే వారు భారత్‌కే రావాలనే స్థాయిలో ఆరా రూపొందించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో సాంకేతికత అభివృద్ధి చేయగల సామర్థ్యం, నైపుణ్యం కలిగిన యువత భారత్‌కు బలమని మోదీ పేర్కొన్నారు.

**స్పేస్ టెక్నాలజీతో రైతులకు మేలు**

స్టార్టప్‌లు కేవలం రాకెట్లు, ఉపగ్రహాలకే పరిమితం కాకుండా వ్యవసాయం, పశుసంవర్ధక, డెయిరీ, పర్యావరణ రంగాలతో కలిసి పనిచేయాలని ప్రధాని సూచించారు. అంతరిక్ష సాంకేతికతను ప్రజల జీవితాలను మెరుగుపరిచే సాధనంగా మార్చాలని కోరారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో అంతరిక్షంపై ఆసక్తి పెంచేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో కలిసి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం స్థిరమైన విధానాలను కొనసాగిస్తే కొత్త రంగాల్లోకి అడుగుపెట్టే పారిశ్రామికవేత్తలకు మరింత ధైర్యం వస్తుందని మోదీ అన్నారు.

**రాకెట్ల నుంచి అంతరిక్ష పరిశ్రమ వరకు**

భారతీయ స్టార్టప్‌లు ఇప్పటికే రాకెట్ తయారీ, శాటిలైట్ నెట్‌వర్క్‌లు, అంతరిక్ష వ్యర్థాల తొలగింపు, ఇన్‌స్పేస్ డాకింగ్, రీఫ్యూయలింగ్, మైక్రోగ్రావిటీలో ఔషధ తయారీ వంటి విభిన్న రంగాల్లో ముందుకు సాగుతున్నాయి. స్కైరూట్ ఏరోస్పేస్ రాకెట్ ఉత్పత్తి, ప్రయోగాలను విస్తరించే ప్రణాళికలను వివరించింది. ఆర్బిట్‌ఎయిడ్ ఏరోస్పేస్ అంతరిక్షంలో ఇంధన నింపే సాంకేతికతపై పనిచేస్తోంది. సెరెండిపిటీ స్పేస్ మైక్రోగ్రావిటీలో ఔషధ తయారీపై దృష్టి పెట్టింది. చంద్రయాన్ 3 విజయంతో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారత్.. ఇప్పుడు ప్రైవేట్ స్పేస్ స్టార్టప్‌ల బలంతో అంతర్జాతీయ అంతరిక్ష మార్కెట్‌లో కీలక శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది.




**కొంచెం ఆలస్యం అయినా 'నేవీగేషన్' మాత్రం సరిగ్గా జరిగింది. దేన్నీ అయినా 'పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి...' అంటుంటారు కదా.. అలాగన్న మాట. ఎప్పుడు... ఏమి పోయింది, ఎక్కడ పోయింది, దాన్ని ఎక్కడ వెతుకుతున్నాము? అంటే.. అంతా 'పర్ఫెక్ట్' గా జరుగుతూ ఉంది, ఆ విషయం మాత్రం స్పష్టం అవుతూ ఉంది. మొదట వాళ్ళను 'జెన్ జీ' అన్నారు. ఆ తర్వాత వాళ్ళను 'పేరసైట్లు', 'కాక్రోచ్'లు అంటే, అవును మీరన్నది నిజమే మేము బొద్దంకలం, పరాన్నజీవులం మాది 'కాక్రోచ్ జనతా పార్టీ' అని వారే అన్నారు. ఇంత అయ్యాక, ఇప్పుడు వాళ్ళు 'కాక్రోచ్ సీజన్ 2' అంటున్నారు.**



సరే, పేరు ఏదైనా కావొచ్చు, కానీ వారి గొంతుల్లో నిజాయితీ ఉందా? దాని మాట ఏమిటి? అవును, నిజమే మొదటి నుంచి ఆ సమస్య స్వభావాన్ని 'గ్రాస్ రూట్స్' వద్ద నుంచి చూస్తున్నవారికి ఆ 'గ్రామర్' ఏమిటో తెలుసు. అక్కడ సమస్య ఉన్నట్టుగా స్పష్టంగా చానాళ్లగా వారికి అర్థమవుతూనే ఉంది. ఎందుకంటే, గడచిన మూడు నాలుగు దశాబ్ధాలుగా మన చదువులు ఎలా మారాయి... అనే విషయ కాల పరిణామక్రమ స్పృహ ఉన్నవారికి... ఇప్పుడు చూస్తున్నవి ఎందుకు ఇలా జరుగుతున్నాయో స్పష్టంమే. ఎదురు చూసి, చూసి, విసిగి చివరికి అవును మేము 'కాక్రోచ్' లమే... అని పిల్లలు అంటుంటే, ఆ 'కాక్రోచ్'ల ఆక్రోశం వెనుక ఉన్న మనదైన నిష్క్రియాపరత్వాన్ని ఆలస్యంగా అయినా అర్థం చేసుకుంటున్నవారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ ఉంది! అమ్మానాన్నలుగా ఇందులో మన తప్పు ఎంత? అని వారు ఇప్పుడు గతాన్ని 'రీ క్యాప్' చేసుకుంటున్నారు!

మన పిల్లల ఆసక్తులు ఏమిటి? వాళ్ళ 'ఐక్యూ' స్థాయి ఏమిటి? అనే ఆరా లేకుండా... కేవలం పత్రికల్లోని ఫుల్ పేజీ ప్రకటనలు చూసి, మనకు స్తోమతు లేకపోయినా అప్పులు చేసి మరీ కార్పొరేట్ కాలేజీల్లో ఎందుకు చదివిచామా... అని; తీరా బీటెక్ చదివి కూడా, ఐటిఐ చదివిన వాళ్ళతో సమానంగా పాతికవేల జీతాల 'జాబ్స్' తో పిల్లలు జీవితాల్ని నెట్టుకొస్తుంటే, వారి తల్లిదండ్రులు హతాశులవుతున్నారు! ఇరుగు పొరుగును చూసి ఆశపడి అమెరికా కలలు కని, ఆస్తులు అమ్మి పిల్లల్ని అక్కడికి పంపితే, అక్కడి అమెరికా రాజకీయాలు, ఇక్కడ ఊళ్ళో ఉన్న మన కుటుంబ ఆర్ధికత రాతల్ని మార్చే నడమంత్రపు రోజుల్లో ఉన్నట్టు ఆలస్యంగా అర్థమవుతూ ఉంది.

రేపు ఏమిటో? అనేది సగటు కుటుంబానికి భరోసా ఇవ్వలేని బలహీన స్థితిలో మన నాయకత్వం ఉంటే, వీళ్ళను నమ్మి 'ప్రైవేట్ ట్రాప్'లో పడి మంచాలు ఎక్కే మధ్యతరగతి అమ్మానాన్నలు; అర్ధ ఆయుష్కులు కావడము చూస్తున్న ఇంటింటి కథే. అస్సలు అదొక 'ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్' సూత్రంతో, చౌక 'లేబర్' కోసం ప్రపంచ మార్కెట్ మన వంటి దేశాలపై విసిరే 'పొలిటికల్ ఎకానమీ' వల అనే ఎరుక మనకు లేదు. సకాలంలో వాటికి ప్రత్యామ్నాయం మన సర్కారులు చూపవు. కడాన ఏవో డిగ్రీలు తెచ్చుకున్నా, చివరికి ఇళ్ళవెంట తిరిగే ఉద్యోగాలతో పిల్లలు సరిపెట్టుకోవలసి వస్తున్నదే... అని గుర్రుగా ఢిల్లీ వైపు చూస్తే. "ఏమి రోడ్డు పక్కన పకోడీలు వేసుకోవడం ఉపాధి కాదా?" అని నేతలు తిరిగి ఎదురు ప్రశ్న వేస్తున్నారు! పైగా ఒకప్పటి 'రోజు వారి కూలి' పనులకు 'గిగ్ ఎకానమీ' అని కొత్త పేరు పెడుతున్నారు.

• 'కాక్రోచ్ సీజన్ 2' అంటూ బయటకు వస్తున్న 'జెన్ ఆల్ఫా' ఏకరువు పెడుతున్న అనుభవాలు వింటున్నప్పుడు, మన పిల్లలకు హైస్కూల్ చదువులు అయ్యే లోపే, ఈ దేశంలో ప్రాధమిక హక్కులు కోల్పోవడం అంటే ఏమిటో, వోటు హక్కు రాకముందే అర్థమయ్యేట్టు తర్ఫీతు ఇస్తున్నట్టుగా ఉంది! అదేంటి... అవును మరి 'నేచర్ కాల్స్' అనే ప్రకృతి సహజ మలమూత్ర విసర్జన అవసరాలు, పిల్లలు ప్రభుత్వ బడిలో కనుక ఉంటే, బలవంతంగా వాటిని ఆపుకోవాలి! ఇక అది ఆడపిల్లల అవసరాలు కనుక అయితే, బడి అయ్యాక వాళ్ళు ఇంటికి వెళితేనే అవి తీరేది! గత నలభై ఏళ్లలో చదువుల సంస్కరణలు గురించి పలు నిపుణుల కమిటీలు ఢిల్లీ సర్కారులకు సమర్పించిన నివేదికలు నిరర్ధకం అయ్యాయి.

ఆర్థిక సంస్కరణలతో వచ్చిన 'ప్రైవేట్' రంగ వ్యాప్తికి అడ్డు అదుపు లేకపోవడంతో, అది చదువుకు చెద పట్టించింది! సామాజిక శాస్త్రాల చదువులు అక్కరలేదనే విధానం ఎటువంటి ('విజన్') భవిష్యదృష్టి అనేది, 1995 లో అది మొదలు అయినప్పుడు అర్థమయిన వారు తక్కువ. ముప్పై ఏళ్ల తర్వాత... "తెలుగువారికి చర్మ స్పృహ తక్కువ, అది దేనికీ స్పందించదు.." అని 'జంతర్ మంతర్' తర్వాత కొందరు మనల్ని కొత్తగా 'డయాగ్నైజ్' చేస్తుంటే, దాని మూలాలు తెలిసినవారు, ఇంటిగుట్టు బయటకు ఎందుకు అని మౌన మునులుగా ఉంటున్నారు.

ఎన్నికల్లో 18 ఏళ్ళకు తొలి వోటు వేస్తున్న యువత వయస్సులో తమకంటే రెట్టింపు వయస్సు ఉన్నవారిని తమ ఎం. ఎల్. ఏ., ఎంపీలుగా ఎన్నుకుంటున్నారు. వాళ్ళు తమకంటే మరో పదేళ్ళు పెద్ద వయస్సు ఉన్నవారిని తమ లెజిస్లేచర్/పార్లమెంటు నాయకులుగా ఎన్నుకుంటున్నారు. అటువంటప్పుడు దేశంలోని 'జెన్ జీ' లేదా 'జెన్ ఆల్ఫా' మనోభావాలు వారి ప్రాధాన్యతలు; మన ప్రభుత్వ పాలసీలుగా ఎలా మారతాయి? ఇటువంటి భిన్న సమూహాల మధ్య 'టూ వే కమ్యూనికేషన్స్' కు ఆస్కారమిచ్చే మానవ సంబంధాలను ప్రోది చేసే సామాజిక శాస్త్రాల చదువుల్ని అటక ఎక్కించి, "దేశం నాడి దొరకడం లేదు.." అంటే, అది ఎలా దొరుకుతుంది?! ఏ పరిష్కారానికి అయినా ఉపరితలంలో ఉన్నవే కారణాలు అని దబాయించే మేధోవర్గం, ఎప్పటిలా ఈ సమస్య మూలాలు దేశ సరిహద్దుల బయట ఉన్నవని, వాటి కోసం అది అక్కడ వెతుకుతూ ఉంది!

కానీ ఇక్కడ విషయం ఏమంటే, ఒకానొక కాలంలో ఒకానొక ఖండంలోని యువత సహజ ప్రవర్తన, అక్కడి దేశాల భౌగోళిక సరిహద్దులకు అతీతంగా ఒకే తీరుగా ఉంటుంది, అనే అతి సాధారణ మానవీయ జ్ఞాన గ్రహింపు లేకుండా "ఇండియా 'కాక్రోచ్' లకు 'చైనా ఎలుకలు' ప్రేరణ.." అంటూ కొందరు మాట్లాడుతున్నారు. దశాబ్దాల తరబడి ఏడాది పొడవునా 'ఎన్నికల రాజకీయమే' ఊపిరిగా 'పబ్లిక్ పాలసీ' ఉండాలని, కోరుకునే అర్ధజ్ఞాన నాయకులకు ఇటువంటి సున్నిత సమస్యల మూలాలను వెతికే 'చదువు' లేకపోవడమే 'జంతర్ మంతర్' ధర్నా అది ఇక్కడ మనకు బోధపడకపోయినా ప్రపంచ వార్త కావడానికి మూల కారణం!

ఇప్పుడు ఇంకా విషయం సద్దుమణగకుండా 'కాక్రోచ్ సీజన్ 2' అంటూ కొత్తగా బయటకు వస్తున్న 'జెన్ ఆల్ఫా' తరం 2010 తర్వాత పుట్టిన పిల్లలు. పదాహారేళ్ల వయస్సులో వాళ్ళు తమ చదుతున్న లేదా చదివి బయటకొచ్చిన ప్రభుత్వ బడుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం గురించి.. ఎటూ సందర్భం వొచ్చింది కదా అని వారూ మాట్లాడుతున్నారు. పైగా తమ చేతిలోని ఫోన్ కెమెరాతో తీసిన తమ బడి పరిసరాల ఫోటోలు, వీడియోలు మా పిర్యాదుకు 'ఆడియోవిజువల్' ప్రూఫ్ అంటూ, వాళ్ళు వాటిని 'ఆన్ లైన్లో' చెలామణిలో ఉంచుతున్నారు. 'స్కూల్స్ ఠీక్ కరో', 'ఫిక్స్ రూరల్ గవర్నమెంట్ స్కూల్స్' నినాదంతో మూడు అంశాలతో వాళ్ళు దేశమంతా సామాజిక స్పృహ కల్పిస్తున్నారు.

"బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఢాకా రాజకీయంగా మాత్రమే కాదు.. దౌత్యపరంగానూ కొత్త దారిని ఎంచుకున్నట్లుగా కనిపిస్తోంది. మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక పాలన తర్వాత జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ అధికారంలోకి రావడం, ఖలీదా జియా తనయుడు తారిఖ్ రహ్మాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఢిల్లీకి కొత్త సమీకరణాన్ని తీసుకొచ్చింది. హసీనా హయాంలో భారత్‌తో బలమైన సంబంధాలు కొనసాగినప్పటికీ.. ఇప్పుడు ఢాకా తన విదేశాంగ విధానాన్ని పునర్నిర్వచించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇదే సమయంలో భారత్ కూడా తారిఖ్ రహ్మాన్ ప్రభుత్వాన్ని దూరం పెట్టకుండా స్నేహహస్తం చాచింది. కానీ ఆగస్టు 23 నుంచి 25 వరకు జరగాల్సిన తారిఖ్ రహ్మాన్ భారత్ పర్యటనపై చివరి నిమిషంలో ఏర్పడిన అనిశ్చితి ఇప్పుడు అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారత్ నుంచి 'సరైన వాతావరణం' కావాలంటున్న ఢాకా.. మరోవైపు షేక్ హసీనా అప్పగింతను ప్రధాన అంశంగా ముందుకు తెస్తోంది. రాజకీయంగా భారత్‌ను విమర్శిస్తూనే.. విద్యుత్, ఇంధనం, వాణిజ్యం, కనెక్టివిటీ విషయంలో మాత్రం ఢిల్లీ సహకారం అవసరమవుతోంది. మరి ఇది తాత్కాలిక రాజకీయ వ్యూహమా? దేశీయ ప్రజాభిప్రాయం కోసం చేస్తున్న దౌత్య కసరత్తా? లేక భారత్‌తో సంబంధాలను కొత్త షరతులతో పునర్నిర్మించాలన్న తారిఖ్ రహ్మాన్ ప్రభుత్వ వ్యూహమా? ఈ ప్రశ్నలకు సమాధానమే ఇప్పుడు ఢిల్లీ–ఢాకా భవిష్యత్ సంబంధాలను నిర్ణయించబోతోంది."



# బంగ్లాదేశ్ డబుల్ గేమ్..
# భారత్ పై మైండ్ గేమ్..

- తారిఖ్ రహ్మాన్ వైఖరితో పెరిగిన సందేహాలు
- బంగ్లా ప్రధాని పర్యటన రద్దు వెనుక అసలు లెక్కేంటి?

## దోస్తీనా.. కుస్తీనా.. బంగ్లా తర్జన భర్జన

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత అక్కడి రాజకీయ దిశ పూర్తిగా మారిపోయింది. మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక పాలన తర్వాత జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించింది. 2026 ఫిబ్రవరి 17న తారిఖ్ రహ్మాన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. హసీనా హయాంలో ఢాకా–ఢిల్లీ సంబంధాలు బలంగా ఉన్నప్పటికీ, 2024 పరిణామాల తర్వాత ఆ సమీకరణం మారింది. ఇప్పుడు తారిఖ్ రహ్మాన్ ప్రభుత్వం 'బంగ్లాదేశ్ ఫస్ట్' అనే విధానాన్ని ముందుకు తెస్తోంది. అంటే భారత్‌కు దూరం కావాలన్నది స్పష్టమైన విధానం కాదు. అదే సమయంలో భారత్‌తో పాత తరహా సంబంధాలను కొనసాగించేందుకు కూడా ఢాకా సిద్ధంగా లేదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తారిఖ్ రహ్మాన్ భారత్ పర్యటన చుట్టూ ఏర్పడిన గందరగోళం కేవలం ఒక పర్యటన రద్దు వ్యవహారంగా చూడలేం. ఇది కొత్త బంగ్లాదేశ్ భారత్‌ను ఏ స్థాయిలో, ఏ షరతులతో డీల్ చేయాలనుకుంటుందో చెప్పే తొలి పెద్ద దౌత్య పరీక్షగా కనిపిస్తోంది. ఆగస్టు 23–25 తేదీల్లో ఢిల్లీ పర్యటనపై మొదట వార్తలు వచ్చినా, ఢాకా అధికారికంగా పర్యటన ఖరారు కాలేదని చెప్పింది.

**• పర్యటన విషయంలో అసలు సందేశం ఏమిటి?**

ఈ వ్యవహారంలో అత్యంత ఆసక్తికరమైన అంశం పర్యటన తేదీలపై స్పష్టత లేకపోవడమే. భారత రాష్ట్రపతి భవన్ నుంచి తారిఖ్ రహ్మాన్ పర్యటనకు సంబంధించిన సమాచారం వెలువడి, కొద్ది సమయంలోనే వెనక్కి తీసుకోవడం దౌత్య వర్గాల్లో చర్చకు దారితీసింది. ఢాకా మాత్రం భారత్ నుంచి సరైన స్పందన కోసం ఎదురుచూస్తున్నామని, ముఖ్యంగా షేక్ హసీనా అప్పగింత అంశంపై తమ అభ్యర్థనకు సమాధానం రావాల్సి ఉందని చెబుతోంది. అంటే తారిఖ్ రహ్మాన్ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలను పూర్తిగా తెంచుకోవాలనుకోవడం లేదని ఒకవైపు కనిపిస్తుంటే, మరోవైపు ఢిల్లీతో సంబంధాలను దేశీయ రాజకీయాల్లో బలహీనతగా చూపించుకోవడానికి కూడా ఇష్టపడటం లేదన్న భావన కలుగుతోంది. భారత్ నుంచి మరింత స్పష్టమైన రాజకీయ సంకేతం రావాలని ఢాకాలోని కొన్ని వర్గాలు కోరుతున్నాయి. కొందరు తారిఖ్ రహ్మాన్ పర్యటన కంటే ముందుగా ప్రధాని నరేంద్ర మోదీ ఢాకా వెళ్లడం వంటి చర్యను కూడా ఆశిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అందువల్ల ఈ పర్యటన వెనుక అసలు ప్రశ్న 'తారిఖ్ వస్తారా? రారా?' అన్నది కాదు. 'భారత్‌తో సంబంధాల్లో కొత్త సమీకరణానికి ఢాకా ఏ ధర కోరుతోంది?' అన్నదే అసలు ప్రశ్న. భారత్ ఈ సందేశాన్ని భావోద్వేగంతో కాకుండా చాలా జాగ్రత్తగా చదవాల్సిన అవసరం ఉంది.

**• హసీనా అంశమే సంబంధాలకు ప్రధాన అంశం**

ఢిల్లీ–ఢాకా మధ్య ప్రస్తుతం ఉన్న అతిపెద్ద సమస్య షేక్ హసీనా. 2024 ఆగస్టులో హసీనా బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. ఆ తర్వాత ఆమెను అప్పగించాలని ఢాకా పదేపదే కోరుతోంది. హసీనా భారత్‌లో ఉండటం మాత్రమే కాదు, ఢిల్లీ నుంచి ఆమె చేసిన రాజకీయ వ్యాఖ్యలు కూడా తారిఖ్ రహ్మాన్ ప్రభుత్వానికి తీవ్ర అసంతృప్తి కలిగిస్తున్నాయి. ఇదే అంశాన్ని భారత్‌పై ఒత్తిడి పెంచడానికి ఢాకా ఉపయోగిస్తున్నట్టు కనిపిస్తోంది. అయితే ఇక్కడ భారత్ ఒక ముఖ్యమైన తేడాను గుర్తించాలి. హసీనా వ్యవహారం ద్వైపాక్షిక సంబంధాలన్నింటినీ నిర్ణయించే ఏకైక అంశంగా మారకూడదు. అప్పగింత అనేది చట్టపరమైన ప్రక్రియ. దానిని రాజకీయ ఒత్తిడితో వేగవంతం చేయడం అంత సులభం కాదు. అదే సమయంలో హసీనా భారత్ నుంచి బంగ్లాదేశ్ అంతర్గత రాజకీయాలపై నిరంతరం వ్యాఖ్యానించే పరిస్థితి కూడా ఢిల్లీకి అసౌకర్యమే. కాబట్టి భారత్ చేయాల్సింది ఒక స్పష్టమైన ద్వంద్వ విధానం. ఒకవైపు హసీనా విషయంలో చట్టపరమైన ప్రక్రియను గౌరవించడం, మరోవైపు భారత భూభాగాన్ని బంగ్లాదేశ్ రాజకీయ పోరాటానికి వేదికగా మార్చకుండా జాగ్రత్త పడటం. హసీనా అంశాన్ని పరిష్కరించే దిశగా ఢాకాతో రహస్య దౌత్య చర్చలు కొనసాగించవచ్చు. కానీ ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు మిగిలిన సంబంధాలన్నింటినీ నిలిపివేయడం భారత్‌కు కూడా, బంగ్లాదేశ్‌కు కూడా ప్రయోజనం కాదు.

**• విద్యుత్ నుంచి వాణిజ్యం వరకు భారత్ బలం**

బంగ్లాదేశ్ భారత్‌ను ఎంత దూరంగా ఉంచుకోవాలని ప్రయత్నించినా, భౌగోళిక వాస్తవాలను మార్చడం సాధ్యం కాదు. విద్యుత్, ఇంధనం, వాణిజ్యం, రవాణా, సరిహద్దు నిర్వహణ, నదీజలాలు, భద్రత వంటి అంశాల్లో రెండు దేశాల ప్రయోజనాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్ విద్యుత్ కొరత ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. దుకాణాలు, మాల్స్‌ను ముందుగానే మూసివేయడం, రాత్రి వేళల్లో బోర్డులు, అలంకరణ లైట్లపై ఆంక్షలు విధించడం వరకు పరిస్థితి వెళ్లిందని తాజా నివేదికలు చెబుతున్నాయి. ఇదే సమయంలో భారత్ ఇప్పటికే బంగ్లాదేశ్‌కు సుమారు 2,500 మెగావాట్ల విద్యుత్‌ను వివిధ మార్గాల్లో అందిస్తోంది. ఆగస్టు ప్రారంభంలో బంగ్లాదేశ్ పవర్ విభాగం కార్యదర్శి ఢిల్లీకి వచ్చి భారత అధికారులతో చర్చలు జరపడం, ముంబై, విశాఖపట్నంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని పరిశీలించడం కూడా సంబంధాల్లో మరో వాస్తవాన్ని చూపిస్తోంది. అంటే రాజకీయ వేదికపై ఢిల్లీపై విమర్శలు ఉన్నా, ఆర్థిక వ్యవస్థకు అవసరమైన సమయంలో భారత్ వైపు చూడాల్సిన పరిస్థితి ఢాకాకు ఉంది. ఇక్కడే భారత్‌కు తన దౌత్య బలం ఉంది. ఆ బలాన్ని ఒత్తిడిగా కాకుండా భాగస్వామ్యంగా ఉపయోగించాలి. విద్యుత్ సరఫరా, గ్రిడ్ కనెక్టివిటీ, రైల్వేలు, పోర్టులు, సరిహద్దు వాణిజ్యం, ఇంధన సరఫరా, డిజిటల్ కనెక్టివిటీ వంటి రంగాల్లో సహకారం పెంచితే బంగ్లాదేశ్ ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కనిపిస్తుంది. అప్పుడు భారత్ వ్యతిరేక ప్రచారానికి కూడా సహజంగానే స్థలం తగ్గుతుంది.

**• భారత్ ఇప్పుడు ఎలా అడుగులు వేయాలి?**

ఇప్పుడు భారత్ ముందున్న మార్గం కఠినమైనదే అయినా స్పష్టంగా ఉంది. మొదటగా తారిఖ్ రహ్మాన్ పర్యటనను ప్రతిష్ఠ సమస్యగా మార్చకూడదు. ఆయన రావాలనుకుంటే గౌరవంతో స్వాగతించాలి. రావడానికి ఆలస్యం చేస్తే ఢిల్లీ కూడా తొందరపడకూడదు. రెండోది, హసీనా అంశాన్ని ద్వైపాక్షిక సంబంధాల నుంచి వేరు చేసి ప్రత్యేక చర్చా మార్గంలో పెట్టాలి. మూడోది, బంగ్లాదేశ్ 'సార్వభౌమ సమానత్వం, జాతీయ గౌరవం, పరస్పర ప్రయోజనం' కోరుకుంటే భారత్ ఆ భాషలోనే స్పందించాలి. నాలుగోది, బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రత, తీవ్రవాద సంస్థల పెరుగుతున్న ప్రభావం, సరిహద్దు భద్రత వంటి అంశాలపై మాత్రం ఎలాంటి రాజీ ఉండకూడదు. ఐదోది, చైనా లేదా పాకిస్థాన్ వైపు బంగ్లాదేశ్ మొగ్గు చూపుతోందన్న భయంతో వెంటనే కఠిన వైఖరి తీసుకోవడం కూడా సరైన వ్యూహం కాదు. ఢాకాకు తన విదేశాంగ విధానాన్ని విస్తరించుకునే అవకాశం ఇవ్వాలి. అదే సమయంలో భారత్ తన ఆర్థిక, భద్రతా ప్రయోజనాలను స్పష్టంగా కాపాడుకోవాలి. తారిఖ్ రహ్మాన్ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిగా యాంటీఇండియా విధానాన్ని ప్రకటించలేదు. ఢాకాలోని కొన్ని వర్గాలు కూడా కొత్త ప్రభుత్వం భారత్‌తో స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలనే కోరుకుంటోందని చెబుతున్నాయి. కాబట్టి భారత్ ఇప్పుడే తలుపులు మూసేయడం కన్నా, తలుపులు తెరిచి ఉంచి లోపలికి రావాల్సిన షరతులను మాత్రం స్పష్టంగా చెప్పడం ఉత్తమం.

**• పొరుగుదేశం విషయంలో ఢిల్లీ వ్యూహం ఇదే**

మొత్తంగా చూస్తే బంగ్లాదేశ్ భారత్‌తో సఖ్యత కోరుకోవడం లేదని చెప్పడం తొందరపాటు నిర్ణయం. అదే సమయంలో పాత తరహాలో భారత్‌పై ఆధారపడే సంబంధాన్ని కొనసాగించాలనుకోవడం లేదన్నది కూడా స్పష్టంగా కనిపిస్తోంది. తారిఖ్ రహ్మాన్ ప్రభుత్వం తన దేశీయ రాజకీయాల్లో 'భారత్‌కు దగ్గరగా ఉన్న ప్రభుత్వం' అనే ముద్రను తప్పించుకోవాలని చూస్తోంది. అందుకే పర్యటన విషయంలో ఆలస్యం, షరతులు, హసీనా అంశం, 'సరైన వాతావరణం' వంటి పదాలు ముందుకు వస్తున్నాయి. భారత్ మాత్రం దీనిని అవమానంగా తీసుకుని ప్రతిస్పందిస్తే దూరం పెరుగుతుంది. అదే సమయంలో బంగ్లాదేశ్ ప్రతి అంశాన్ని ఒత్తిడికి ఉపయోగిస్తే వెంటనే మినహాయింపులు ఇవ్వడం కూడా సరైంది కాదు. ఢిల్లీకి అవసరమైన వ్యూహం 'వెయిట్ అండ్ వాచ్' మాత్రమే కాదు, 'ఎంగేజ్ అండ్ బ్యాలెన్స్'. ప్రజలకు ఉపయోగపడే విద్యుత్, వాణిజ్యం, కనెక్టివిటీ, నీటి వనరులు, సరిహద్దు నిర్వహణ వంటి అంశాల్లో సహకారాన్ని వేగవంతం చేయాలి. రాజకీయ విభేదాలను ప్రత్యేక మార్గంలో పరిష్కరించాలి. హసీనా అంశంలో చట్టాన్ని అనుసరించాలి. తీవ్రవాదం, మైనారిటీ భద్రత విషయంలో స్పష్టమైన ఎర్రగీతలు గీయాలి. తారిఖ్ రహ్మాన్ భారత్‌కు వస్తే అది 'ఎవరు గెలిచారు, ఎవరు తగ్గారు' అనే దౌత్య పోటీగా కాకుండా కొత్త అధ్యాయానికి ప్రారంభంగా ఉండాలి. రాకపోయినా భారత్ తొందరపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బంగ్లాదేశ్‌కు భారత్ అవసరం ఉన్నంతగా, భారత్‌కు కూడా స్థిరమైన, స్నేహపూర్వక బంగ్లాదేశ్ అవసరం ఉంది. కాబట్టి ఢిల్లీ లక్ష్యం బంగ్లాదేశ్‌ను తన వైపు లాగడం కాదు; బంగ్లాదేశ్ ఎటువైపు వెళ్లినా భారత్‌తో సంబంధం తెంచుకోలేని విధంగా పరస్పర ప్రయోజనాల బంధాన్ని మరింత బలంగా నిర్మించడం కావాలి. అదే దీర్ఘకాలికంగా భారత ప్రయోజనాలను కాపాడే తెలివైన దౌత్యం.





### ఇంకా చాలా ఉంది!

**తారిఖ్ పర్యటనపై పెరిగిన సందేహాలు**

తారిఖ్ రహ్మాన్ భారత్ పర్యటనపై చివరి నిమిషంలో ఏర్పడిన అనిశ్చితి ఢిల్లీ–ఢాకా సంబంధాలపై కొత్త ప్రశ్నలు లేవనెత్తింది. భారత్‌తో దూరం పెంచుకోవాలన్న సంకేతమా, లేక దేశీయ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తీసుకున్న నిర్ణయమా అన్నది స్పష్టంగా లేదు. అయితే పర్యటన విషయంలో అధికారిక దౌత్య మార్గాల కంటే మీడియా ద్వారా సంకేతాలు రావడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.

**హసీనా అంశమే ప్రధాన అడ్డంకి**

షేక్ హసీనాను భారత్ నుంచి అప్పగించాలన్న డిమాండ్ బంగ్లాదేశ్ రాజకీయాల్లో కీలక అంశంగా మారింది. తారిఖ్ ప్రభుత్వం దీనిని భారత్‌తో సంబంధాల చర్చల్లోనూ ముందుకు తెస్తోంది. అయితే అప్పగింత అనేది చట్టపరమైన ప్రక్రియ. అందుకే హసీనా అంశాన్ని మొత్తం ద్వైపాక్షిక సంబంధాలకు ముడిపెట్టకుండా, ప్రత్యేక దౌత్య మార్గంలో పరిష్కరించుకోవడం భారత్‌కు, బంగ్లాదేశ్‌కు మేలు.

**అవసరాల దగ్గర భారత్ వైపే ఢాకా చూపు**

రాజకీయంగా భారత్‌పై విమర్శలు ఉన్నా, విద్యుత్, ఇంధనం, వాణిజ్యం, కనెక్టివిటీ వంటి కీలక రంగాల్లో బంగ్లాదేశ్‌కు భారత్ అవసరం ఉంది. ముఖ్యంగా విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్న ఢాకాకు భారత విద్యుత్ సరఫరా కీలకం. దీంతో రాజకీయ విభేదాలు ఒకవైపు, ఆర్థిక వాస్తవాలు మరోవైపు అన్న పరిస్థితి ఏర్పడింది. ఇదే భారత్‌కు కీలకమైన దౌత్య బలం.

**భారత్ తొందరపడకుండా వ్యూహంతో ముందుకు**

తారిఖ్ రహ్మాన్ భారత్‌కు రావడంలో ఆలస్యం చేశాడని ఢిల్లీ ప్రతిష్ఠ సమస్యగా తీసుకోవాల్సిన అవసరం లేదు. అదే సమయంలో ప్రతి డిమాండ్‌కు వెంటనే అంగీకరించడమూ సరైంది కాదు. భారత్ చర్చల తలుపులు తెరిచి ఉంచుతూ, హసీనా అంశాన్ని చట్టపరంగా చూడాలి. మైనారిటీ భద్రత, తీవ్రవాదం, సరిహద్దు అంశాల్లో మాత్రం స్పష్టమైన వైఖరి కొనసాగించాలి.

**భవిష్యత్ బంధం పరస్పర ప్రయోజనాలపైనే**

భారత్–బంగ్లాదేశ్ సంబంధాలు ఇకపై పాత రాజకీయ సమీకరణాలపై కాకుండా పరస్పర ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ స్వతంత్ర విదేశాంగ విధానం కోరుకోవచ్చు. భారత్ కూడా దానిని గౌరవిస్తూ తన భద్రతా, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవాలి. రాజకీయ దూరాలు వచ్చినా విద్యుత్, వాణిజ్యం, భద్రత, కనెక్టివిటీ బంధాలు బలంగా ఉంటే సంబంధాలు పూర్తిగా తెగిపోయే అవకాశం తక్కువ.





### రేపటి సంబంధాలు ఎటువైపు?

భారత్–బంగ్లాదేశ్ సంబంధాల భవిష్యత్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉంది. తారిఖ్ రహ్మాన్ ప్రభుత్వం భారత్‌కు పూర్తిగా దూరం కావాలనుకుంటే.. విద్యుత్, వాణిజ్యం, సరిహద్దు భద్రత, రవాణా, నదీజలాలు వంటి అంశాల్లో అది బంగ్లాదేశ్‌కే నష్టంగా మారే అవకాశం ఉంది. మరోవైపు భారత్ కూడా పాత సంబంధాల ఆధారంగా ఢాకా తన విధానాలను కొనసాగిస్తుందని ఆశించడం వాస్తవికం కాదు. కొత్త బంగ్లాదేశ్ తన సార్వభౌమత్వాన్ని, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని బలంగా చూపించాలనుకుంటోంది. అందుకే ఢిల్లీ నుంచి వచ్చే ప్రతి అడుగును జాగ్రత్తగా పరిశీలించే అవకాశం ఉంది. ఇక్కడ భారత్ తొందరపడకుండా వ్యూహాత్మకంగా ముందుకు సాగాలి. తారిఖ్ రహ్మాన్ పర్యటన ఆలస్యమైందని సంబంధాలను దెబ్బతీయడం కంటే.. అధికారిక దౌత్య మార్గాల్లో చర్చలను కొనసాగించాలి. హసీనా అప్పగింత అంశాన్ని చట్టపరమైన ప్రక్రియగా వేరు చేసి.. మిగిలిన ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లాలి. అదే సమయంలో బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రత, తీవ్రవాద ప్రభావం, సరిహద్దు సమస్యల విషయంలో మాత్రం భారత్ తన వైఖరిని స్పష్టంగా ఉంచాలి. చివరికి ఢిల్లీ–ఢాకా బంధం ఎవరు ఎవరిపై ఆధిపత్యం సాధించారన్న దానిపై కాకుండా.. ఎవరి ప్రయోజనాలు ఎంతగా పరస్పరం ముడిపడ్డాయన్న దానిపై ఆధారపడుతుంది. రాజకీయ దూరాలు వచ్చినా ఆర్థిక, భద్రతా, ప్రజా ప్రయోజనాల బంధం బలంగా ఉంటే.. బంగ్లాదేశ్ భారత్‌కు శాశ్వత ప్రత్యర్థిగా మారే అవకాశం తక్కువ. అదే భారత్ అనుసరించాల్సిన దీర్ఘకాలిక వ్యూహానికి అసలు బలం.




# గాయంతోనూ పంత్ భారీ సిక్సర్

## బద్దలైన సోలార్ ప్యానల్

శ్రీలంకతో రెండో టెస్టులో గాయంతో బాధపడుతున్న రిషభ్ పంత్ తన పవర్ హిట్టింగ్‌తో మరోసారి అదరగొట్టాడు. కొలంబోలో రెండో రోజు ఆటలో లహిరు కుమార వేసిన షార్ట్ బాల్‌ను పంత్ భారీగా పుల్ చేయగా.. బంతి ఏకంగా 95 మీటర్లు దూసుకెళ్లి స్టేడియం పైకప్పుపై ఉన్న సోలార్ ప్యానల్‌ను ధ్వంసం చేసింది. దీంతో మ్యాచ్ అధికారులు బంతిని మార్చాల్సి వచ్చింది. తొలి రోజు ఎడమ మణికట్టుకు బంతి తగలడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన పంత్.. రెండో రోజు తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి ధాటిగా ఆడాడు. శ్రీలంక బౌలర్లు వరుసగా షార్ట్ బాల్స్ వేసినా వెనక్కి తగ్గలేదు. ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 63 పరుగులు చేశాడు. ధ్రువ్ జురేల్‌తో కలిసి ఏడో వికెట్‌కు 151 బంతుల్లో 112 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అనంతరం లంచ్ తర్వాత తొలి బంతికే లాంగ్ ఆఫ్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. పంత్ దూకుడుతో పాటు జురేల్ శతకంతో భారత్ భారీ స్కోరును సాధించి శ్రీలంకపై పట్టు బిగించింది.

## పంత్‌కు గాయం.. ఆందోళనలో టీమిండియా

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో రిషభ్ పంత్ గాయం ఇప్పుడు టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. రెండో రోజు ఆట చివర్లో భారత్ బౌలింగ్‌కు దిగిన సమయంలో పంత్ మైదానంలో కనిపించలేదు. దీనిపై ధ్రువ్ జురేల్ కీలక వివరాలు వెల్లడించాడు. పంత్ కుడి భుజానికి గాయం కావడంతో నొప్పి ఉందని, ఫిజియో అతడిని పర్యవేక్షిస్తున్నాడని చెప్పాడు. అందుకే తాను చివరి దశలో వికెట్ కీపింగ్ చేసినట్లు జురేల్ తెలిపాడు. అంతకుముందు బ్యాటింగ్‌లోనూ పంత్‌కు దెబ్బలు తగిలాయి. తొలి రోజు లహిరు కుమార బౌలింగ్‌లో అతడి ఎడమ మణికట్టుకు బంతి తగిలింది. రెండో రోజు అసిత ఫెర్నాండో వేసిన బౌన్సర్ కుడి భుజానికి బలంగా తాకింది. అయినా పంత్ వెనక్కి తగ్గకుండా 89 బంతుల్లో 63 పరుగులు చేశాడు. ప్రస్తుతం పంత్ పరిస్థితిని ఫిజియో బృందం నిశితంగా పరిశీలిస్తోంది. రేపటికి అతడు కోలుకుంటాడని జురేల్ ఆశాభావం వ్యక్తం చేశాడు. మరోవైపు భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేయగా, శ్రీలంక 8/2తో 495 పరుగుల వెనుకంజలో ఉంది.




## జురేల్ సెంచరీ వెనుక పంత్ సలహాలు

శ్రీలంకతో రెండో టెస్టులో అద్భుత శతకంతో మెరిసిన ధ్రువ్ జురేల్.. రిషభ్ పంత్‌తో కలిసి బ్యాటింగ్ చేసిన అనుభవాన్ని పంచుకున్నాడు. కొలంబో టెస్టులో వీరిద్దరూ 112 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. తాను బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ప్రతి పరిస్థితిపై పంత్ సలహా తీసుకుంటానని జురేల్ చెప్పాడు. పంత్ భారత్ కోసం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లో అద్భుతంగా ఆడాడని, అతని అనుభవం తనకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపాడు. పంత్‌లా ఆడాలని ఎప్పుడూ ప్రయత్నించనని, తన సహజ ఆటపై దృష్టి పెట్టడమే తన వ్యూహమని స్పష్టం చేశాడు. ఏ బౌలర్‌ను ఎప్పుడు ఎదుర్కోవాలి, ఏ స్పెల్‌లో జాగ్రత్తగా ఆడాలనే విషయాల్లో పంత్‌తో చర్చిస్తానన్నాడు. ఇదే సమయంలో పంత్ కుడి భుజానికి గాయం కావడంతో జురేల్ వికెట్ కీపింగ్ చేశాడు. తన శతకాన్ని తండ్రి, తాతకు అంకితం చేసిన జురేల్.. తండ్రి సైనికుడు, తాత రైతు అని గుర్తుచేసుకున్నాడు. “జై జవాన్.. జై కిసాన్” అంటూ వారిని స్మరించుకున్నాడు.

## శ్రీలంకపై భారత్ పూర్తి ఆధిపత్యం

శ్రీలంకతో కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత్ రెండో రోజు ఆటను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 503/9 వద్ద డిక్లేర్ చేసిన టీమిండియా.. ఆ తర్వాత శ్రీలంకను కష్టాల్లోకి నెట్టింది. భారత బౌలర్లు ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్ చెరో వికెట్ తీసుకోవడంతో ఆట ముగిసే సమయానికి శ్రీలంక 8/2తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అంతకుముందు ధ్రువ్ జురేల్ అద్భుత శతకంతో భారత స్కోరును భారీ స్థాయికి తీసుకెళ్లాడు. జురేల్‌కు ఇది రెండో టెస్టు సెంచరీ. 99 పరుగుల వద్ద రనౌట్ ప్రమాదం నుంచి తప్పించుకున్న అతడు చివరకు 115 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడికి ప్రసిద్ధ్ కృష్ణ నాలుగు పరుగులతో సహకరించాడు. భారత్ భారీ స్కోరుతో డిక్లేర్ చేసిన తర్వాత శ్రీలంక బ్యాటింగ్‌కు దిగింది. అయితే వెలుతురు సరిగా లేదని శ్రీలంక ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేసిన సమయంలోనే రెండు వికెట్లు కోల్పోయారు. దీంతో రెండో రోజు ముగిసేసరికి భారత్ మ్యాచ్‌పై స్పష్టమైన పట్టు సాధించింది.







## మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది. క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్ర స్వరూపంతో అమ్మవారిని అత్యంత శక్తిమంతంగా చూపించారు.



## రాకాలో ఐశ్వర్యలక్ష్మి

### నెగిటివ్ షేడ్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్ తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయని





## వారణాసిలో మరో సంచలనం

### వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ అర్టిస్ట్‌లు

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ.1,400 కోట్ల భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది.'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ పక్రియను డిజైన్ చేస్తున్నారట. 50కి పైగా భాషల్లో ఇంత భారీ సంఖ్యలో డబ్బింగ్ ఆర్టిస్టులతో పనిచేయడం భారతీయ సినిమా స్థాయిలో అరుదైన ప్రయత్నంగా మారనుంది. వారణాసి కథాంశం కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. భూమిని ఢీకొట్టేందుకు దూసుకొస్తున్న ఓ భారీ ఉల్క వల్ల ఏర్పడే ప్రమాదం నుంచి వారణాసితో పాటు ప్రపంచాన్ని రక్షించే సాహసోపేతమైన కథతో ఈ సినిమా సాగుతుందని సమాచారం. మహేష్ బాబు ఇందులో 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా.. కథలో భాగంగా వివిధ కాలాల మధ్య ప్రయాణించే సాహసికుడిగా ఆయన పాత్ర ఉండబోతుందని టాక్. భారతీయ పురాణాలు, సనాతన సంస్కృతి అంశాలను ఆధునిక గ్లోబల్ అడ్వెంచర్ కథతో కలిపి రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా, ఆఫ్రికాలోని కెన్యా తదితర ప్రాంతాల్లో జరిగింది. అంతేకాదు.. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకున్న తొలి భారతీయ చిత్రంగా ఈ సినిమా ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.




## 80 కోట్ల మార్క్ దాటిన ఇరుముడి

రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ హిట్‌గా రికార్డులు సృష్టిస్తోంది. తమిళంలో ఈ సినిమాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణం ఈ నగరంలోనే ప్రారంభమైందని తెలిపారు. 'ఇరుముడి'కి జీవీ ప్రకాశ్ హృదయంతో సమానం. ఎడిట్ రూమ్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (నేపథ్య సంగీతం) లేకుండా చూసినప్పుడే.. ఇది విజయం సాధిస్తుందని అర్థమైంది. క్లైమాక్స్ చూసిన తర్వాత థియేటర్‌లలో మగవారితో పాటు చిన్న పిల్లలు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఆ దృశ్యాలు నిజంగా హృదయాన్ని హత్తుకుంటున్నాయి‘ అని రవితేజ అన్నారు. ప్రియా భవానీ శంకర్ గొప్ప నటి అని ప్రశంసించారు. ఈ సినిమా తెలుగులో విజయం సాధించినట్లే.. తమిళంలోనూ కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.'ఇరుముడి' చిత్రానికి ఓవర్సీస్‌లోనూ మంచి స్పందన వస్తోంది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. ఈ క్లబ్‌లో చేరిన రవితేజ మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఇక మూడు రోజుల్లోనే ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.80 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.